

ఒక్క రాత్రి.. 462 కేసులు : ఎస్పీ

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): రాత్రి వేళల్లో అనవసరంగా, ఆవారాగా తిరిగే వాళ్లపై ఉక్కుపాదం తప్పదని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశామని తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం రాత్రి వాహన తనిఖీలు చేసి 462 కేసులు నమోదు చేశామన్నారు.రికార్డులు సరిగా లేని వాహనా లపై 42, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై 9, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై 140 కేసులు నమోదు చేశామన్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి ఎఫ్‌సీఐ గొడౌన్స్ సమీపంలో ఉన్న రాజీవ్ నగర్ కాలనీలో గురువారం ఉదయం దక్షిణ మండల డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ హరిబాబు సిబ్బంది, శక్తి టీం, స్పెషల్ పార్టీ పోలీసులుతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు.13 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

ఆంధ్రజ్యోతి

పొగాకు మడుల్లో యూరియా వాడకూడదు

సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు



దేవరపల్లి మండలం పల్లంట్లలో పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు

దేవరపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే పొగాకు నారు మడులు పెంపకం ఎంతో కీలకమైందని సీటీఆర్ఐ శాస్త్రవేత్త ప్రభాకరరావు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల లో గురువారం పొగాకు రైతులతో సమావేశం అనంతరం పొగాకు నారుమడులను సీటీఆర్ శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు అధికారులు పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతు నారుమడులు కట్టే దశలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అధిక దిగుబడినిచ్చే పొగాకు విత్తనా లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నారుమడి పెంపకంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారుమడుల్లో యూరియా వాడకూడదని అమోనియ సల్ఫేట్ వాడాలని సూచించారు. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పంటసాగు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, ఫీల్డ్ ఆఫీసర్లు వినోద్, ప్రజాపతి, రైతులు గన్నమని ప్రసాద్, గంగాధర్, యలమాటి సురేశ్, బాబ్జీ, నలమాటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో జిల్లాకు ప్రథమం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్ - 2047 కార్యక్రమానికి సంబంధించి ప్రజారోగ్యంలో 92 శాతం పనితీరు సాధించి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పిల్లలకు పూర్తి టీకాలు, శిశు మరణాల రేటు తగ్గుదల, నవజాత శిశు మరణాలరేటు, మాతృమరణాల రేటు, గర్భిణీల్లో రక్తహీనత నివారణ, జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సౌకర్యాలు, ఎన్‌సీడీ ఫాలోఅప్, క్షయరోగం విజయవంతమైన చికిత్స రేటు, డెంగీ మరణాల నిష్పత్తి తగ్గింపు తదితర కీలక పనితీరు సూచికల్లో ఏ ప్లస్ రేటింగ్ సాధించిందన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

యూరియా సరఫరాకు టోకెన్ విధానం : కలెక్టర్

కోరుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని, టోకెన్ విధానం ద్వారా ప్రతి రైతుకు యూరియా సరఫరా జరుగుతోందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శ్రీరంగపట్నం ప్యాక్ సొసైటీలో గురువారం రైతులతో కలెక్టర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రస్తుతం రైతులు ఎకరాకు 4-5 బస్తాల యూరియాను వాడుతున్నారని, వాస్తవానికి 50 నుంచి 60 కిలోల వరకు మాత్రమే మూడు దశల్లో వినియోగిస్తే సరిపోతుందన్నారు. పంటకు సగ భాగం యూరియా.. మిగిలిన సగ భాగం నానో యూరియా వాడాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ పనులకు వచ్చే కూలీలు తప్పుడు పద్ధతుల వల్ల యూరియా దుర్వి నియోగమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవ రావు, శ్రీరంగపట్నం ప్యాక్ సొసైటీ అధ్యక్షుడు గణపతి స్వామి, పాల్గొన్నారు.

'అనవసరంగా యూరియా వాడొద్దు'

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవసరా నికి మించి యూరియా వాడకం వల్ల నేల సహజ స్వభావం కోల్పోతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. రాజవోలు సొసైటీలో నానో యూరియాపై అవగాహన కల్పించారు. సంప్రదాయ యూరియాకు బదులు నానో యూరియా వాడాలన్నారు. 45 కేజీల యూరియా బస్తాకు అర లీటరు నానో యూరియా సమా నంగా పనిచేస్తుందన్నారు. యూరియాకు బదులుగా సహజంగా దొరికే ఆవుపేడ,ఆవు మూత్రంతో ద్రవ,ఘన జీవామృతం వినియోగించి పలు పంటలు పండించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవపాయ శాఖ శ్రీనివాసరెడ్డి, ఏవో పీటర్ పాల్గొన్నారు

దొంగా.. పోలీస్!



పోలీసుల స్వాధీనంలోని వాహనాలు మాయం

- స్టేషన్‌కు వెళితే సామగ్రి ఖాళీ
- టైర్లు, బ్యాటరీలకు రెక్కలు
- స్టేషన్లలో చోరశిఖామణులు
- రాత్రి వేళ పోలీసుల అతి
- గస్తీ పేరిట సాగుతున్న దందా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఉన్నతాధికారుల చర్యలు నిల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం కనబడలేదంటే దొంగల పని అనుకోవచ్చు. కానీ పోలీసుల స్వాధీనంలో ఉన్న వాహనాలు మాయమైపోతున్నాయంటే ఏ పేరు పెట్టాలో వారే చెప్పాలి. పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న వాహనాలు యజమాని చేతికి తిరిగి చేరితే అదృష్టమనే చెప్పాలి. జరిమానా చెల్లించినా బండి మాత్రం మనుగడ స్థితిలో ఉందో లేదో తెలియని పరిస్థితి దాపురించింది. యూనిఫాం సిగ్గుపడేలా కొందరు ఖాకీలు దిగజారిపోవడంతో పోలీస్ శాఖ పరువు బజారున పడుతోంది.

ఆ బైక్ ఏమైందో..

పోలీసులు తనిఖీలు చేసే సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. ఇలా పలు కేసుల్లో స్టేషన్‌కు చేర్చే వాహనాలు ఉంటాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ ఇలా పలు విభాగాల పోలీసులు చిక్కిన కాడికి ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు చేరుస్తుంటారు. కొన్నింటిని చేయి తడిపితే వదిలేస్తుంటారు. ఆ తంతును పక్కన పెడితే.. జిల్లా వ్యాప్తంగా ఏ స్టేషన్‌లో చూసినా 100 బైక్‌లకు పైనే ఉంటాయి. వీటికి తోడు కార్లు, లారీలు ఏళ్ల తరబడి తుక్కులో కలిసిపోతాయి. పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు స్టేషన్ నుంచి పరారైపోతున్నాయి. తాజా ఘటన చూస్తే. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై దేవీచౌక్‌లోని మెడికల్ షాపునకు వెళ్లారు. మందులు తీసుకొని తిరిగి వెళదామని బైక్ ఎక్కారు. రయ్‌మని పోలీస్ జీపు వచ్చి వాళ్లకు అడ్డంగా ఆగింది. ఓ పోలీసు జీపు దిగి ఒక్క ఉదుటున సాహసంగా వెళ్లి ఆ బైక్ తాళాలు లాక్కున్నారు. భవానీపురం నుంచి మందుల కోసం వచ్చామని, అర్జెంటుగా తీసుకెళ్లాలని కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు. ఉదయం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిమానా చెల్లించి బైక్ తీసుకెళ్లాలని చెప్పారు. ఉసూరుమంటూ ఇంటి దారి పట్టిన ఆ యువకులు.. మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు వెళ్లి రూ.500 జరిమానా చెల్లించారు. కొన్ని తాళాలు టేబుల్‌పై వేసి వాళ్ల బండి తాళాన్ని వెతుక్కోమన్నారు. ఎంత వెతికినా తాళం కనిపించలేదు, బయటకు వెళ్లి చూడగా బండీ లేదు. దీంతో కంగారుపడిన ఆ పోలీసులు జరిమానా రశీదు వెనక్కి తీసుకొని డబ్బులు తిరిగిచ్చేశారు. బండి ఎక్కడుందో వెతుక్కోమని పరీక్ష పెట్టారు. దీంతో ఆ యువకులు ట్రాఫిక్, క్రైం, లా అండ్ ఆర్డర్ స్టేషన్ల చుట్టూ రెండు రోజులు తిరిగినా ఫలితం లేకపోయింది. ఫిర్యాదు చేస్తే వెతుకుతామంటూ పోలీసులే సలహా ఇవ్వడంతో ఆ బైక్ యజమానికి బుర్ర తిరిగినంత పనైంది. ఎవరితో చెప్పుకోవాలో తెలియక లబోదిబోమంటున్నాడు.

విడిభాగాలు హుష్‌కాకి..

ఏదైనా బైక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిందంటే విడిభాగాలకు గ్యారంటీ ఉండదు. ఒక రెండు రోజులు బైక్ స్టేషన్ వద్ద వదిలేస్తే వాహన సామగ్రి అంతా మాయం చేయగల సిద్ధహస్తులుంటారు.. ఇదేదో దొంగల పనికాదండోయ్.. ఖాకీ ముసుగులో ఉన్న పోలీసుల పనే. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో కొన్ని పెద్ద కేసుల్లో కోర్టు ఆదేశాలు పాటించాల్సి ఉంటుంది.చిన్న కేసుల్లో అధిక సంఖ్యలో వాహనాలు స్టేషన్‌కు చేరుతూ ఉంటాయి. కేసు కట్టి ఆ యజమానిని కోర్టులో ప్రవేశపెడితే జరిమానా వేస్తారు. ఆ జరిమానా చెల్లించి.. కొంత సొమ్ము ఖాకీ జేబులో పెడితే గానీ బండి, దాని తాలూకూ తాళం చెవి కనిపించదు. కొన్ని కేసుల్లోని వాహనాలను తగు ప్రక్రియతో వేలం నిర్వహించవచ్చు. అటువంటి వాహనాల విడిభాగాలకు రెక్కలు వస్తుంటాయి.బ్యాటరీ, టైర్లు, ఇంజన్, హెడ్‌లైటు.. చివరికి సిగ్నల్ లైట్లను కూడా విప్పేసి పట్టుకుపోతారు. ఈ పని ఖాకీలే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మితిమీరుతున్న దందా..

కొందరు ఖాకీల వల్ల జనాల తిట్లు తప్పడం లేదు. రాత్రి వేళల్లో పోలీసుల దందా మరీ మితిమీరుతోంది. ప్రయాణికులను సైతం ఆపేసి ఏవేవో ప్రశ్నలతో మానసిక వేదనకు గురి చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు కనీసం రశీదు ఇవ్వరు. వాళ్ల ఐడెంటిటీ.. అంటే పేరు, హోదా, పని చేస్తున్న ప్రదేశం వంటివి కూడా చెప్పరు. అధికారులు ఉంటే వారి హోదా, స్టేషను తెలిసిపోతుంది. కానీ సిబ్బంది విషయంలో ఇబ్బంది ఏర్పడుతోంది. బండి తీసుకొని, ఉదయం స్టేషనుకురా అని చెప్పేసి పంపేస్తారు. తర్వాత ఆ బండి ఎక్కడకు వెళుతుందో, అన్ని అవయవాలతో ఉంటుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. గతంలో స్వాధీనంలో ఉన్న వాహనాలు అమ్మేసుకున్నారనే ఆరోపణలు ఓ సీఐపై వచ్చాయి. ఇలాంటివి పరిపాటిగా మారిపోయాయి. దీంతో తమ వాహనం స్వాధీనం చేసుకున్నది పోలీసా? దొంగా? అనే అనుమానాన్ని బాధితులు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆయా పోలీసు స్టేషన్లలో ఏ కేసుల్లో, ఎన్ని స్వాధీనం చేసుకున్న వాహనాలు ఉన్నా యనే లెక్కాపత్రం లేకపోవడం బాధ్యతా రాహి త్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

కొత్త కలెక్టర్‌గా కీర్తి

కలెక్టర్ ప్రశాంతి బదిలీ

- గతంలో జేసీగా చేకూరి కీర్తి
- నాడు పాలనలో తనదైన ముద్ర




కలెక్టర్ చేకూరి కీర్తి | ప్రశాంతి

రాజమహేంద్రవరం/కాకినాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా చేకూరి కీర్తి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన కీర్తిని ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేసీగా చేకూరి కీర్తి సేవలందించారు. పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు.ముఖ్యంగా కొవిడ్ సమయంలో ఆమె చేసిన సేవలు ఎనలేనివి. కరోనా బాధితులకు ఆసుపత్రుల ఏర్పాటు, వాటి పనితీరు పరిశీలన ఇలా అనేక విధాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి రూ.కోటికి పైగా ఫైన్ వేసి ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు ఓ హెచ్చరిక పంపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. విశాఖకు చెందిన చేకూరి కీర్తి తండ్రి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరప డ్డారు. మొదట్నుంచి సమాజానికి ఉపయోగపడే కీలక బాధ్యతల్లో ఉండాలనేది ఆమె కోరిక. ఆమె తాతయ్య డీసీహెచ్ తిరుపతి రాజు నౌకాశ్రయం ఆపరేషన్ మేనేజర్‌గా ఉండే వారు. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇంటర్ తర్వాత మద్రాస్ ఐఐటీలో చేరిన కీర్తి.. మెటలర్జీ అండ్ మెటీరియల్ సైన్స్ ఎంచుకున్నారు. ఓ రోజు అక్కడికి వచ్చిన తమిళ ఐఏఎస్ అధికారిని చూసి సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నారు. తొలిసారి సివిల్స్‌లో 440వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. రెండో సారి 512 ర్యాంకు తెచ్చుకున్నారు. మూడో సారి ఆలిండియా లెవెల్‌లో 14వ ర్యాంకు సాధించారు. ప్రస్తుత కలెక్టర్ పి.ప్రశాంతికి ఇంకా పోస్టింగ్ ఇవ్వ లేదు. ప్రశాంతి జిల్లా కలెక్టర్‌గా 2024 జూన్ 28వ తేదీన బాధ్యతలు చేపట్టి 14 నెలల 11 రోజులు సేవలందించారు.

ప్రశాంతి బదిలీ ఎందుకంటే?

కలెక్టర్ పి.ప్రశాంతి బదిలీ వెనుక కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ఆమె నిబంధనలు తు.చ. తప్పలేదని.. పాలనలో తనదైన ముద్ర వేశారని అధికారులు చెబుతున్నారు. ఎక్కడా అవినీతి మచ్చలేకుండా వ్యవహ రించడం గమనార్హం.కొందరు ప్రజాప్రతి నిధులు చెప్పినట్టు వినకపోవడం వల్లే ఆమె బదిలీ అయ్యారనే ప్రచారం ఉంది.కేవలం కలెక్టర్‌గా చాంబర్‌లో కూర్చుని విధులు నిర్వహించడమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించే వారు.ఇసుక బోట్స్‌మన్ సొసైటీల వ్యవహారంలో కొందరు రాజకీయనేతలతో ఆమె విబేధించడమే కాకుండా ఒక పద్ధతి ప్రకారం ర్యాంపులు కేటాయించారు. ఓపెన్ ర్యాంపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతుంటే పట్టుకుని వాటిని మళ్లీ తెరవనీయకుండా చేయగలిగారు. జిల్లాలో పంచాయతీల పరిధిలో పారిశుధ్య మెరుగుదలకు ప్రయత్నం చేశారు. అధికారులు, ఉద్యోగులు ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా వారిపట్ల కఠినంగా వ్యవహరించే వారు. దివాన్‌చెరువులో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారనే కారణంతో ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇంటికి పంపించేశారు.అధికారులంటే ఆఫీసులో కూర్చోవడమే కాదని.ప్రజల్లోకి పంపించారు. నిబంధనల మేరకు..ముక్కుసూటిగా వ్యవహరించడం వల్ల కొంత మందికి శత్రువుగా మారినట్టు ప్రచారం ఉంది.సీఎం చంద్రబాబు పెట్టిన బంగారం కుటుంబం- మార్గదర్శి కార్యక్రమంలో ఆమె మొదట ఓ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. ఎరువుల కొరత ప్రచారాన్ని తిప్పికొట్టారు. రాజమహేంద్రవరం కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించి కార్పొరేషన్ పనితీరును ఒక పద్ధతిలో పెట్టారు. మునిసిపాలిటీలో ఫీల్డ్ వర్కు అంటూ ఇంటికెళ్లిపోయే అనేకమంది అధికా రులకు ఆమె అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్పొరేషన్‌ను గాడిలో పెట్టారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని నగరంలో చాలా వరకు అమల్లోకి తెచ్చారు.బర్త్, డెత్ సర్టిఫికెట్ల ఫారమ్ మోడల్ కొత్తది అమల్లోకి తెచ్చా రు. ఆమె కఠిన వైఖరి,ఎవరిని లెక్క చేయకపోవడమే ఆమె బదిలీకి కారణంగా తెలుస్తోంది.



పెట్రో కెమి..కిల్ ఫ్యాక్టరీ!

గత వైసీపీ నిర్లక్ష్యం..గాల్లో కలిసిన ప్రాజెక్టు

ఒక్క ఛాన్స్ అంటే.. ఓటరు ఆలోచించాడు.. అవకాశమిచ్చాడు.. ఆ అవకాశాన్ని జగన్ దుర్వినియోగం చేశారు.. ఎంతలా అంటే అభివృద్ధి చేయాల్సిన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వదిలేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఘటనే ఇందుకు నిదర్శనం.. గత వైసీపీ విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందని నాయకులు అంటూనే ఉంటారు.. ఇది అక్షర సత్యం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 32 వేల కోట్ల ప్రాజెక్టు ఇస్తామంటే వదులుకుంటారా.. అధికారమిచ్చిన ఐదేళ్లూ పట్టించుకోకుండా జగన్ వదిలేశారు.. ఆ ప్రాజెక్టును అతీగతీ లేకుండా చేసేశారు...ఆ కథాకమామిషు ఏమిటో తెలుసుకోవాలనుందా..!

- కాకినాడ, ఆంధ్రజ్యోతి


కాకినాడలో రూ.32 వేల కోట్లతో తొమ్మిదేళ్ల కిందట తలపెట్టిన పెట్రో కెమికల్ కాంపెక్స్ ఏర్పాటు ముగిసిన అధ్యాయంగానే కనిపిస్తోంది. ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్న నేపథ్యంలో కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎప్పటికైనా ఇక్కడా ఆ తరహా ప్రాజెక్టు రాకపోతుందా అనే ఆశలు తాజాగా నెల్లూరు ప్రాజెక్టుతో అడియాశలైనట్లయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పూర్తిగా ఈ ప్రాజెక్టు మూలనపడి పోయింది. పెట్రో కాంప్లెక్స్ వీజీ ఎఫ్ నిధులు రాష్ట్రం భరించే విషయంలో అప్పటి జగన్ సర్కారుదే తప్పని కేంద్రం కుండబద్దలు కొట్టింది. ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు రెండు వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నప్పటికీ గత సర్కారు తీరు వల్ల ప్రాజెక్టు కొడిగట్టిపోయింది.

కొంపముంచిన బాధ్యతా రాహిత్యం..

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో కొత్త ప్రాజెక్టు కేటాయించింది. అందులో భాగంగా కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. 2017లో కాకినాడ ఎస్ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి గెయిల్- హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటుకు వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి, దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం.

- విభజన హామీగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- రూ.32 వేల కోట్లతో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- తొమ్మిదేళ్లు పూర్తయినా కదలిక లేదు
- తాజాగా నెల్లూరులో బీపీసీఎల్ ప్రాజెక్టు
- కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై చర్చ
- ప్రాజెక్టు జాప్యానికి బాధ్యత వైసీపీదేనన్న కేంద్రం
- నాడు బాబు పట్టుదల.. జగన్ నిర్లక్ష్యంతో మూలకు

నాడు చంద్రబాబు ఏం చేశారు?



ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలెక్కించడానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. పనులు ప్రారంభం చేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. రూ.32 వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు వల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధిపొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది.కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది.

తరువాత జగనేం చేశారు?



2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. నాటి నుంచీ ఈ ప్రాజె క్టు ఊసు పక్కన పడిపోయింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో 2021 జూన్‌లో కేంద్రాన్ని సీఎం హోదాలో జగన్ కలిసి ప్రాజెక్టు కొనసాగించాలని కోరా రు. కానీ కేంద్రం నుంచి సానుకూల ప్రకటనేదీ రాలేదు. మూడేళ్ల కిందట పెట్రో కాంప్లెక్స్ అసలు కాకినాడకు వస్తుందా? రాదా? అనే దానిపై పలువురు ఎంపీలు కేంద్రాన్ని లోక్‌సభలో ప్రశ్నిస్తే ప్రాజెక్టు జాప్యానికి జగన్ ప్రభుత్వమే కారణం అని కుండ బద్దలుకొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని సమాధానమిచ్చింది. అయినా జగన్ ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదు. దీంతో ప్రాజెక్టుపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభు త్వం మళ్లీ ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు ప్రాజెక్టుతో మళ్లీ చర్చ..

రాష్ట్రప్రభుత్వం చొరవతో ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఏటా తొమ్మిది మిలియన్ మెట్రిక్ టన్నుల సా మర్థ్యంతో దీన్ని స్థాపిస్తోంది. ప్రాజెక్టు ద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. 42 నెలల్లో పూర్తి చేసేలా ఇటీవల ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రెండు రోజుల కిందట బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్‌కు కేంద్ర అటవీ పర్యావరణశాఖ నుంచి కీలక అనుమతులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడు కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. తొమ్మిదేళ్ల నుంచి అతీగతీ లేని ప్రాజెక్టు నెల్లూరు పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుతో ఇక్కడా ఎంతో కొంత కదలిక రావాలనే ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. పెట్రో ప్రాజెక్టుకు అనువైన వాతావరణం ఉన్నా కేంద్రం పట్టించుకోక కాకినాడ పెట్రోకాంప్లెక్స్ అధ్యాయం ముగిసినట్టే కనిపిస్తోంది.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి 'స్ఫూర్తి ప్రదాత'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కలెక్టర్ ప్రశాంతి వినూత్న కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.రామకృష్ణ మిషన్ సహకారంతో ఈ నెల 20 నుంచి ప్రతి శనివారం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో స్ఫూర్తిదాయక ప్రసంగాలను చెప్పిస్తారు. వివేకానంద చికాగో ప్రసంగం రోజును పురస్కరించుకొని 213 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. క్రమశిక్షణ, స్థితప్రజ్ఞత,విశాల దృక్పథం, సామాజిక స్పృహను పెంపొందించడానికి 'స్ఫూర్తి ప్రదాత' ఉపకరిస్తుందన్నారు. 'బలమే జీవనం, బలహీనతే మరణం' అని వివేకానంద చెప్పిన సందేశాన్ని గ్రహించి విద్యార్థులు బలహీనతను వదిలి ధైర్యంతో, లక్ష్యసాధనతో ముందుకు సాగాలన్నారు. రామకృష్ణ మిషన్ నుంచి స్వామి పరిజ్ఞేయానంద, స్వామి సేవ్యానంద ఉపదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సలహాలకు డయల్ 15100

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆనంద్ నగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల నిషేధం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు న్యాయ పరమైన సలహాలకు 15100 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. హెచ్ఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కళాకృతులు!

మొక్కల బొమ్మలకు పెరుగుతున్న క్రేజ్

కొత్త పంథా ఎంచుకుంటున్న యువ రైతులు









(ఆంధ్రజ్యోతి - కడియం)

దేశంలోనే ప్రముఖ గార్డెన్స్‌లో కనువిందు చేసే మొక్కల బొమ్మలు ఇప్పుడు కడియం నర్సరీల్లో సందడి చేస్తున్నాయి. గతంలో ఈ మొక్కను పెంచి, పోషించి బొమ్మల ఆకృతిలో తీర్చిదిద్దడానికి ఆయా గార్డెన్స్ నిర్వాహకులకు చాలాకాలం పట్టేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. నర్సరీల్లోనే ఈ మొక్కల బొమ్మలను అద్భుతంగా తయారుచేసి గార్డెన్స్‌లకు, కార్పొరేట్ కంపెనీలకు ఖరీదైన గృహ యజమానులకు విక్రయిస్తున్నారు. అందుకనే ఈ మొక్కల బొమ్మలకు విశేష ఆదరణ పెరుగుతోంది. ఇప్పటికే పలువురు ఈ మొక్కల బొమ్మలను తీర్చిదిద్దగా తాజాగా కడియం మండలం పొట్టిలంక గ్రామంలో మురుగన్ నర్సరీ యువకుడు దూలం ధనరాజు తయారుచేసిన మొక్కలు కొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.

● బొమ్మల తయారీ స్ఫూర్తితో..

చదువుకునే సమయంలో ఆటబొమ్మలు చేయడం ధనరాజుకు అలవాటు. చెక్కతో, మట్టితో తయారుచేసేవాడు. తర్వాత అయ్యప్పస్వామి మందిరాలు, పెళ్లిళ్లలో ఆకృతులు చేయడంలోనూ దిట్ట. అదిప్పుడు ఈ మొక్కల రూపకల్పనకు శ్రీకారం చుట్టింది. పొట్టిలంకలో నర్సరీ నిర్వహిస్తున్న ఈ యువకుడు ఆలమూరు మండలం మడికి గ్రామం. చెముడులంక ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివి రాజమహేంద్రవరం కూరగాయల మార్కెట్‌లో, మడికి కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా పనిచేశాడు.

● 50 సెంట్ల భూమిని కౌలుకి తీసుకుని..

50 సెంట్ల భూమిని కౌలుకి తీసుకుని తన ప్రయత్నం ప్రారంభించాడు. యూట్యూబ్‌లో చూసి ఏ ఆకారాలు మొక్కలు బొమ్మలుగా మారిస్తే ఆకర్షణీయంగా ఉంటుందో ఆలోచించాడు. గిటారి, చెస్‌బోర్డులో గుర్రం, ఇంటి ఆవరణ లైటు, అందమైన పుష్పం వంటి మొక్కల తయారుపై దృష్టి పెట్టాడు. ఈ మొక్కల తయారీకి నేర్పరితనం కలిగిన కూలీలు కావాల్సి ఉంటుంది. తీగజాతి మొక్కను ముందుగా తయారు చేసుకున్న బొమ్మల ఆకారంలో ఇనుపమెస్‌లకు వీటిని అల్లుతారు. ఈ మొక్క కావాల్సిన ఆకారం వచ్చేవరకు కటింగ్ చేస్తూ ఉండాలి. ధనరాజు కూలీలు లేకుండా తానే ఈ బొమ్మలను రూపుదిద్దుతున్నాడు.

● విభిన్నంగా మొక్కలు తయారు చేయాలని..



చదువు అయ్యాక కొంతకాలం కూరగాయల మార్కెట్‌లో గుమస్తాగా చేశాను. అయితే తనే సొంతంగా ఏదైనా చేయాలనే తపన ఉండేది. బొమ్మలు వేయడంలో ఆసక్తి ఉండేది. ఆ అభిరుచినే ఉపాధిగా ఎందుకు మలుచుకోకూడదనే ఆలోచన వచ్చింది. అర ఎకరం భూమి లీజుకు తీసుకుని టెర్మినేలియా గ్రీన్, ఫాక్స్‌టెయిల్ వంటి మొక్కలు తయారుచేసి విక్రయించేవాడిని. అయితే ఈ రకాలు అందరూ చేస్తున్నారు. మామూలు నర్సరీ మొక్కల తయారు కంటే పెట్టుబడి ఎక్కువయినప్పటికీ మనం బిన్నంగా చేయాలని ఆలోచించి ఈ రకంగా మొక్కల బొమ్మలు తయారు చేయడం ప్రారంబించాను. **- దూలం ధనరాజు, నర్సరీ నిర్వాహకుడు పొట్టిలంక, కడియం మండలం**

నేడు కాకినాడ కలెక్టరేట్‌లో

ధాన్యం సేకరణపై సమీక్ష

- హాజరుకానున్న పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్
- ఐదు జిల్లాల అధికారులతో ధాన్యం సేకరణపై ప్రత్యేక కార్యాచరణ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌సీజన్‌లో ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై సమీక్షించేందుకు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం కాకినాడకు విచ్చేస్తున్నారు.కాకినాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.15గంటలకు సమావేశం ఆరంభమవుతుంది. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జేసీలు, సివిల్ సప్లయిస్ అధికారులు, వ్యవసాయశాఖ అధికారులు, ఇతర సంబంధితశాఖల అధికారులు పాల్గొంటారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఐదు జిల్లాల పరిధిలో ఏ మేరకు వరిపంటను సాగు చేశారు. ఏఏ రకాల వరివిత్తనాలు నాటారు. ఎంతమేరకు ఉత్పత్తి వస్తోంది.. వంటి అంచనాలపై చర్చిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతు సేవా కేంద్రాల ద్వారా సేకరించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షిస్తారు. ధాన్యం సేకరణ సమయంలో మిల్లర్లు రైతులకు అందించాల్సిన సహకారంపై సూచనలు ఇస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం 48 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాలోకి ధాన్యం సొమ్ములు జమ చేస్తోంది. ఇందులో ఏమైనా ఇబ్బందులు ఉంటే మంత్రి దృష్టికి తీసుకురావొచ్చు. ధాన్యం సేకరణ కార్యాచరణ ప్రణాళికపై ఐదు జిల్లాల అధికారులు మంత్రి ముందు ప్రజంటేషన్ ఇస్తారు. ఏ ఏ జిల్లాల్లో ఏ మేరకు సేకరణ చేయగలమో వివరిస్తారు. ధాన్యం సాగులో రాష్ట్రంలోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ నేపథ్యంలో ఈఐదు జిల్లాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్‌పెట్టింది. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కమిషనర్ సౌరభ్‌గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పాల్గొంటారు.

పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల పర్యటన షెడ్యూల్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్రవారం ఉదయం 5గంటలకు కాకినాడ జీఆర్‌టీ హోటల్‌కు చేరుకుంటారు. అనంతరం ఉదయం 10.15గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షకు హాజరవుతారు. సమీక్ష ముగిసిన తర్వాత మధ్యాహ్నం 2.30గంటలకు రైస్‌మిల్లర్లు, రైతులు, పీఏసీఎస్ ప్రతినిధులతో సమావేశమవుతారు. 5.30గంటలకు ముగిస్తారు. సాయంత్రం 6గంటలకు జీఆర్‌టీకి చేరుకుంటారు. తర్వాత విజయవాడకు పయనమవుతారు.

శ్రీలంక సముద్ర జలాల్లో..

చిక్కుకున్న మత్స్యకారులు

- విడుదలకు ఫలించిన కాకినాడ ఎంపీ ఉదయ్ కృషి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సముద్ర జలాల్లో వేట సాగిస్తున్న సోనాబోటు నావిగేషన్ వ్యవస్థలో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా పొరపాటున శ్రీలంక దేశ సముద్ర జలాల్లోకి ప్రవేశించి అక్కడ జైల్లో మగుతున్న కాకినాడ మత్స్యకారులు ఎట్టకేలకు విడుదలయ్యారు. దీంతో మత్స్యకారుల విడుదలకోసం కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ నెలరోజులుగా చేసిన కృషి ఫలించింది. గతనెల 4వతేదీన కాకినాడ, జగన్నాథపురానికి చెందిన పంతాడి బ్రహ్మానందం తోపాటు మరో ముగ్గురు మత్స్యకారులు అక్రమంగా తమ సముద్ర జలాల్లోకి ప్రవేశించారని శ్రీలంక కోస్ట్‌గార్డ్ అధికారులు అదుపులోకి తీసుకుని జాఫ్నా జైల్లో నిర్బంధించారు. అదే రోజు విషయం తెలుసుకున్న ఎంపీ వెంటనే స్పందించి శ్రీలంకలో భారత కాన్సుల్ జనరల్ అధికారి సాయిమురళీతో ఫోన్ మాట్లాడి పరిస్థితి వివరించడంతోపాటు ఎప్పటికప్పుడు ఢిల్లీలో విదేశాంగశాఖ అధికారులను సంప్రదించి మత్స్యకారుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు గురువారం జాఫ్నా కోర్టు నలుగురు మత్స్యకారులను విడుదల చేయగా వారి బోటును తిరిగి అప్పగించారు. మత్స్యకారులు మరో రెండురోజుల్లో కాకినాడకు చేరుకోనున్నారు. మత్స్యకారుల విడుదల కోసం అవిశ్రాంత పోరాటం చేసిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌కు మత్స్యకార సంఘ నాయకులు, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటారు. బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలనే ఆసక్తిగా ఉన్నా.. వారికి సరైన ప్రోత్సాహం లభించదు. అలాంటి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్)ను ప్రారంభించింది. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే పేద విద్యార్థులను ప్రోత్సహించడం ఈ పథకం లక్ష్యం.

- ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు కేంద్రం సాయం
- ఎన్ఎంఎంఎస్ దరఖాస్తులకు ఆహ్వానం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్(ఏపీ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) విభాగం ఈ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పథకం కింద పరీక్ష నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు స్కాలర్‌షిప్ అందిస్తారు. అర్హులకు తొమ్మిది, పది, ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేస్తారు.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

ఎన్ఎంఎంఎస్ కోసం హెచ్‌టీటీపీ://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీలు రూ.50 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఏడో తరగతిలో 55 శాతం మార్కులు కచ్చితంగా ఉండాలి. ఈ ఏడాది పరీక్షకు ఈ నెల నాలుగో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అక్టోబర్ 30 నాటికి దరఖాస్తు గడువు పూర్తికానుంది. డిసెంబర్ ఏడో తేదీన పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నాపత్రం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో ఉంటుంది. మేధస్సుకు పదును పెట్టేలా 90 ప్రశ్నలు, గణితం 20, సోషల్ 35, సైన్స్ 12, ఎస్ఏస్ 11 ప్రశ్నలు ఉంటాయి. ఉత్తీర్ణత పొందినవారు 8, 9 తరగతుల్లో 55 శాతం, పదోతరగతి 60, ఇంటర్ ప్రథమ, ద్వితీయం 55 శాతం చొప్పున మార్కులు సాధిస్తేనే ఉపకార వేతనాలు లభిస్తాయి. విద్యార్థి కుటుంబ వార్షికాదాయం రూ.మూడున్నర లక్షలకు మించి ఉండకూడదు.

ఏడాదికి 200 మందికి పైగా..

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షను గత కొన్నేళ్లుగా నిర్వహిస్తూ వస్తోంది. ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. గత నాలుగేళ్లుగా ఏడాదికి సుమారు 200 మందికిపైగా విద్యార్థులకు ఈ ఉపకార వేతనాలు అందజేస్తోంది.



శిక్షణ పొందుతున్న నూతన ఎంపీడీవోలనుద్దేశించి ప్రసంగిస్తున్న కమిషనరు ముత్యాలరాజు

ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

శిక్షణ పొందుతున్న ఎంపీడీవోలకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు సూచన

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు పనితీరు మెరుగుపరుచుకోవాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కమిషనరు రేవు ముత్యాలరాజు పేర్కొన్నారు. ఎంపీడీవోలుగా ఇటీవలే ఉద్యోగోన్నతి పొంది కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న వారితో ఆయన కొద్దిసేపు మాట్లాడారు. ఉద్యోగంలో ప్రతిరోజూ ప్రతి స్థాయిలో సమస్యలు ఎదురవుతుంటాయని, వాటిని తమ నైపుణ్యంతో సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతిరోజూ ఎదురవుతున్న సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో గుర్తించి అదే తీరులో పరిష్కరిస్తే ఇబ్బందులు ఉండవన్నారు. అప్పుడే ఉద్యోగ జీవితం సంతృప్తికరంగా ఉంటుందని, శిక్షణల ద్వారా పరిపాలనా నియమావళిపై సమగ్ర అవగాహన పొంది సత్ఫలితాలు సాధించవచ్చన్నారు.

సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం పనితీరు సంతృప్తికరంగా ఉందని ముత్యాలరాజు పేర్కొన్నారు. గురువారం ఆయన శిక్షణ తరగతులు, అధికారులకు వసతి, భోజన సదుపాయాలు, శిక్షణా కేంద్ర ఆవరణలో పచ్చదనంలను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ కేఎస్వీ ప్రసాదరావు ద్వారా తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సువిశాలమైన ఆవరణ ఉన్నందున శిక్షణ తరగతులకు వసతులు పెంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వైద్య, విద్య, ఇంజనీరింగ్ వంటి ఇతర ప్రభుత్వ శాఖల శిక్షణలు కూడా ఈటీసీ ఆవరణలో నిర్వహించుకునేలా ప్రణాళికలు రూపొందించుకునేందుకు జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. ఇందుకు నిర్వహణా కమిటీ సభ్యుల నుంచి సూచనలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. అధ్యాపకులతో సమావేశమై శిక్షణ తీరుతెన్నులపై సమాచారాన్ని రాబట్టారు. ప్రతి ఉద్యోగికీ కేడర్‌లో పనితీరు మెరుగుపరుచుకునేందుకు శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం శిక్షణ కేంద్రం ఆవరణలో ఒక మొక్కను కమిషనరు ముత్యాలరాజు నాటారు. ప్రిన్సిపాల్ ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా జడ్పీ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, కాకినాడ జిల్లా పంచాయతీ అధికారి రవి కుమార్, ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ జి.రమణ, జేఎన్టీయూకే ప్రొఫెసర్ అలపాటి శ్రీనివాసు, డీడీవోలు శ్రీనివాసు, విజయభాస్కర్ పాల్గొన్నారు.

అయోధ్య బాలరాముడికి ప్రత్యేక విల్లంబు



శ్రీనివాసశాస్త్రికి విల్లంబు అందజేస్తున్న దృశ్యం

మండపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని బాలరాముడికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం మారేడుబాకకు చెందిన శిల్పి వాసా శ్రీనివాసరావు 9 కిలోల వెండిపై రెండు తులాల బంగారు పూతతో విల్లంబు (బాణం) తయారు చేశాడు. ఐదుగురు కళాకారులు 15 రోజులు శ్రమించి ఏడు అడుగులు ఎత్తు, 9.5 కిలోల రాగి, రెండు కాసులు బంగారంతో పూత పూశారు. ఇందుకు రూ.2 లక్షలు వ్యయమైందని శ్రీనివాసరావు చెప్పాడు. గురువారం దీనిని అయోధ్యకు చెందిన శ్రీరామ వృక్షం ట్రస్టు వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాసశాస్త్రికి శ్రీనివాసరావు అందజేశారు.

సిద్ధివినాయకునికి వెండి పళ్లెం బహూకరణ

అయినవిల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలోని శ్రీసిద్ధి వినాయకస్వామిని విశాఖపట్నం జిల్లా తగరపువలసకు చెందిన కటకం అవినాష్-సాహిత్యశృతి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రూ.లక్షా 35వేల విలువైన ఒక కిలో 50 గ్రాముల వెండి పళ్లెం బహూకరించారు. దాతలకు ఆలయ ప్రధానార్చకుడు వేదాశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేసి అభినందించారు.



వెండి పళ్లెం అందజేస్తున్న అవినాష్-సాహిత్య శృతి దంపతులు





వేదాశీర్వచనం పొందుతున్న సమగ్ర శిక్షా ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావు, సత్యదేవుడి దర్శనానంతరం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్

సత్యదేవునికి ప్రముఖుల పూజలు

అన్నవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ గురువారం విచ్చేశారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం జవహర్‌కు పండితులు వేదాశీర్వచనం ఇవ్వగా ఈవో స్వామివారి ప్రసాదం అందజేశారు. ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ అన్నవరం దేవస్థానంలో పనిచేస్తున్న ఎస్సీ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఉద్యోగాలు, పదోన్నతుల్లో ఎస్సీ రిజర్వేషన్ అమలవుతోందా అని అడిగి తెలుసుకున్నారు. తమకు ఎటువంటి ఇబ్బందులూ లేవని వారు సమాధానమిచ్చారు. దేవస్థానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్ పాటించాలని ఈవోకు మంత్రి సూచించారు.

సమగ్ర శిక్షా డైరెక్టర్ (ఐఏఎస్) బి.శ్రీనివాసరావు సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. రెవెన్యూ ప్రొటోకాల్ అధికారి భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు'లో 16 మందికి ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి

సామర్లకోట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలోని పలు మండల పరిషత్ కార్యాలయాల్లో ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలుగా పనిచేస్తున్న 16 మందికి ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. వీరు తక్షణం ఆయా మండలాల్లో బాధ్యతలు చేపట్టాలని జడ్పీసీఈవో వీవీఎస్ లక్ష్మణరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

- ఏలేశ్వరం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.వెంకట సూర్యనారాయణను పెద్దాపురం ఎంపీడీవోగా నియమించారు.ఇప్పటివరకు పెద్దాపురం ఎంపీడీవోగా పనిచేసిన డి.శ్రీలలిత విశాఖ జిల్లా డీవీవోగా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు.
- యు.కొత్తపల్లి డిప్యూటీ ఎంపీడీవో కె.హరికృష్ణ సత్యారెడ్డిని గండేపల్లి ఎంపీడీవోగా నియమించారు.
- రాజమహేంద్రవరం ఎంపీడీవోగా అక్కడే డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను నియమించారు.
- అల్లవరం ఎంపీడీవోగా ఉప్పలగుప్తం డిప్యూటీ ఎంపీడీవో పీఆర్‌సీ రాజ్‌కుమార్‌ను నియమించారు.
- ఉప్పలగుప్తం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా డ్వామా ఏవో డి.కృష్ణను నియమించారు.
- పి.గన్నవరం ఎంపీడీవోగా మలికిపురంలో డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.మల్లికార్జునరావును నియమించారు.
- కపిలేశ్వరపురం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా రావికమతం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న హెచ్.భానోజీరావును నియమించారు.
- అంబాజీపేట ఎంపీడీవోగా కాట్రేనికోన డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న బి.మమతను నియమించారు.
- మలికిపురం ఎంపీడీవోగా ముమ్మిడివరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న సీహెచ్ లక్ష్మీకల్యాణిని నియమించారు.
- సఖినేటిపల్లి ఎంపీడీవోగా కె.గంగవరం డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న కేఎస్ గౌరీ కుమారిని నియమించారు.
- యు.కొత్తపల్లి ఎంపీడీవోగా శంఖవరం మం డల పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న ఎ.లక్ష్మీరెడ్డిని నియమించారు.
- అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల ఎంపీడీవోగా విశాఖ జిల్లా అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఏవీవీ కుమార్‌ను నియమించారు.
- కాకినాడ రూరల్ ఎంపీడీవోగా కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న బి.కృష్ణగోపాల్‌ను నియమించారు.
- తాళ్లరేవు ఎంపీడీవోగా అల్లవరం మండల పరి షత్ కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న బి.లక్ష్మణరావును నియమించారు.
- గోకవరం ఎంపీడీవోగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ఎంపీడీవో కార్యాలయ ఏవోగా పనిచేస్తున్న సీహెచ్ రవికుమార్ వర్మను నియమించారు.
- శంఖవరం ఎంపీడీవోగా కృష్ణా జిల్లా పామర్రు డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేస్తున్న జి.కిషోర్‌ను నియమించారు.

అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ప్రారంభం

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా 68వ పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 బాలబాలికలుకు క్రీడా పోటీలు కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీనివాస్‌కుమార్, సుధారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎండీ షరీఫ్, కాకినాడ అర్బన్ ఎంఈవో రవి, కాకినాడ రూరల్ ఎంఈవో టీవీఎస్ రంగారావు హాజరయ్యారు. వారు జాతీయ పతాకానికి గౌరవవందనం చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆర్చరీ, సెపక్‌తక్రా, గట్కా క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, కార్యదర్శి వి.మాచారిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆర్చరీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు


చెట్ల నుంచి గెలలు సేకరిస్తున్న కార్మికుడు

ఆ వేతన..

● పామాయిల్ గెలల కోత కార్మికులకు చాలీచాలని కూలీ
● కుటుంబాన్ని పోషించేందుకు తప్పని ఆర్థిక భారం
● తరచూ ప్రమాదాలకు గురవుతున్న వైనం
● పట్టించుకోని రైతులు, ప్రభుత్వం

జగ్గంపేట, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మనం నిత్యం వినియోగించే పామాయిల్ నూనె ముడిసరుకుకు వాడే పామాయిల్ గెలలను తీసే కోత కార్మికులు ఆర్థిక పరిస్థితి దారుణంగా ఉంది. సరైన కూలీ (వేతనం) అందక ఇబ్బందులకు గురవుతున్నారు. వివరాల్లోకి వెళితే... కాకినాడ జిల్లా జగ్గంపేట నియోజకవర్గంలో పామాయిల్ కోత కార్మికులు దాదాపుగా రెండు వేల మంది వరకు ఉన్నారు. వీరంతా చాలీచాలని కూలీలతో వారి కుటుంబాలను నెట్టుకొస్తు న్నారు. ఇటీవలకాలంలో ఉభయగోదావరి జిల్లాలతో పాటు అల్లూరి జిల్లా మన్యం ప్రాంతాలలో అధికశాతం పామాయిల్ తోటలు వేయడంతో పాటు కర్నాటక రాష్ట్రంలో కూడా ఈ పంటను పండించటం జరుగుతోంది. ప్రతి ఇంటికీ నిత్యవసర వస్తువుగా పామాయిల్ అవసరం కాబట్టి దీన్ని ఆసరాగా తీసుకుని రాష్ట్రంలోని ఉభయగోదా వరి జిల్లాలతో పాటు ఏజెన్సీలో విద్యుత్ బోర్లు, వర్షాధారంగా ఈ పంటను సాగుచేస్తున్నారు.గత రెండుసంవత్సరాల నుంచి ఈ పామాయిల్ ధర టన్ను రూ. 16 వేలు నుంచి రూ20 వేలు వరకూ నడుస్తూ ఉంది. అయితే ఈ పామాయిల్ గెలలను చెట్టు నుంచి వేరు చేసి ఫ్యాక్టరీకి తరలించడానికి నైపుణ్యం గల కార్మికులు అవసరం అవుతారు. దీనిలో భాగంగా జగ్గంపేట నియోజకవర్గంలో పామా యిల్ కోత కార్మికులు ఈ వృత్తిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తమ తాతలు, తండ్రుల నుంచి వారసత్వంగా ఈ వృత్తినే నమ్ముకుని ఉన్నారు. రోజుకి రూ. 700 కూలీ మాత్రమే కిడుతుందని వారు అంటున్నారు. పామాయిల్ ధరలు పెరుగుతూ రైతులు, పరిశ్రమలు లాభాల బాటలో ఉన్నారు. కానీ తమ ప్రాణాలకు తెగించి చెట్టు నుంచి గెలలను వేరుచేసే సమయాల్లో పాము కాట్లకు, విద్యుత్‌వైర్లు తగిలి ప్రాణాలు కోల్పోతున్నారు. వీరికి ఎటువంటి బాసట లేకపోవడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని పలువురు కార్మికులు వాపోతున్నారు.



ప్రమాదాల బారిన పడుతున్నాం

- టేకుమూడి వీరబాబు, సంఘం ప్రెసిడెంట్

ఉభయ గోదావరి జిల్లాలే కాకుండా, ఇతర రాష్ట్రాలకు కూడా పామాయిల్ గెలలు కోతకు వెళుతుంటాం. ఇలా గెలలో కోసే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నాం. దీంతో మా కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ప్రభుత్వం మా కార్మికులకు బీమా సౌకర్యంతో పాటు ఆర్థిక భరోసా కల్పించాలి.

పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలి

- పిల్లి శ్రీను, సంఘం ఉపాధ్యక్షుడు



మేము ప్రమాదాల బారిన పడినప్పుడు రైతు ఎంతో కొంత సాయం చేస్తున్నారు. అలాగే పరిశ్రమలు, ప్రభుత్వం కూడా ఈ సాయం అందించడంతో పాటు మాకు భద్రత కల్పించాలి. అప్పుడే మేము కొంత వరకు ఆర్థిక భారం నుంచి ఉపశమనం పొందగలుగుతాం.

అంతర్వేది హుండీ ఆదాయం

రూ. 35,62,444 లక్షలు


స్వామివారి హుండీని లెక్కిస్తున్న దేవస్థానం సిబ్బంది, తదితరులు

అంతర్వేది, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖాధికారి బీ.సత్యనారాయణ పర్యవేక్షణలో అమలాపురం తనిఖీ అధికారి జే.రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 83 రోజులకు గాను ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ. 35,07,678 లక్షలు, గుర్రాల క్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.14,679 వేలు, అన్నదాన హుండీ ద్వారా రూ.40,087 వేలు, మొత్తం రూ.35,62,444 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

అలాగే నాలుగు గ్రాముల బంగారం, 39 గ్రాముల వెండి వస్తువులు, పలు దేశాల విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, సూపరింటెండెంట్ విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్

దేవరపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి మండలం రామన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జిల్లాలోని సబ్ జూనియర్ బాలురు, బాలికల సెపక్‌తక్రా పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా జిల్లా జట్టుకు విద్యార్థులను ఎంపిక చేసినట్టు రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ తెలిపారు. వీరంతా ఈనెల 13, 14 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. బాలుర విభాగంలో ... కే.అభిలాష్ (దొమ్మేరు), జే.ప్రకాశ్ (రామన్నపాలెం), వీ.హర్ష (చిన్నాయిగూడెం) ఎస్‌జీ శ్రీరామ్ (చిన్నాయిగూడెం), బాలికల విభాగంలో.. ఎం.తేజస్వి (రామన్నపాలెం), డీ.అంజలి (రామన్నపాలెం), కే.సాయి శ్రీలక్ష్మి (రామన్నపాలెం), నీరజ (చిన్నాయిగూడెం),కే.స్రవంతి (చిన్నాయిగూడెం) ఉన్నారు. కార్యక్రమంలో రామన్నపాలెం పీఈటీ సరస్వతి, పలు స్కూళ్ల పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి ఒకరి మృతి

కె.గంగవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కే. గంగవరం మండలంలోని సుందరపల్లిలో గురువారం గడ్డి మందు తాగి కుంచెనపల్లి గనిరాజు (47) మృతిచెందాడు. పామర్రు ఎస్‌ఐ ఎస్‌కే జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గనిరాజు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడి మానసికస్థితి సరిగా లేకపోవడంతో అమలాపురంలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఇటీవల కొన్ని రోజులుగా చికిత్స చేయించుకోవడం మానేశాడు. ఈ నేపథ్యంలో వ్యవసాయ పనులు సరిగ్గా చేయలేకపోతున్నానని తీవ్ర మనస్థాపం చెంది బుధవారం గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

22 నుంచి విజయదుర్గా పీఠంలో దేవీ నవరాత్రులు


వెదురుపాక విజయ దుర్గా అమ్మవారు

రాయవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వెదురుపాక విజయ దుర్గా పీఠంలో ఈనెల 22 వ తేదీ నుంచి వచ్చేనెల రెండు వరకు దేవీ శరన్నవ రాత్రులు నిర్వహిస్తున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు విలేకరులకు తెలిపారు. గురువారం పీఠంలో పీఠాధిపతిగాడ్ చేతులమీదుగా ఉత్సవాల కరపత్రాన్ని విడుదల చేశారు. అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు మాట్లాడుతూ 2వ తేదీ ఉదయం 8:19 నిమిషాలకు గురుహోరలో అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశ స్థాపనతో పూజలలు ప్రారంభమౌతాయన్నారు. ప్రతిరోజూ అమ్మ వారికి భక్తులచే సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, ఉదయం 9 గంటలకు సప్తశతి పారాయణ, 10 గంటలకు దేవీ భాగవత ప్రవచనాలు, సాయంత్రం నాలుగు గంటలకు శ్రీలలితా సహస్ర నామ పారాయణ, సాయంత్రం అమ్మవారికి సువాసినీల పూజ, చతుర్వేదస్వసి, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన ఉంటాయని చెప్పారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అది ఆకతాయి చర్యే

● ఎటువంటి మతపరమైన ఉద్దేశాలు లేవు
● కేవలం మతపరమైన జెండాలనే ప్రదర్శించారు
● మతసామరస్యాన్ని కాపాడేందుకు ముస్లింల కృషి
● ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ



కాకినాడలో విలేకరులతో మాట్లాడుతున్న ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ

కాకినాడ, సెప్టెంబర్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 5న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జరిగిన ర్యాలీలో మత విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలేవీ జరగలేదని, కొందరు యువకులు ఆకతాయిగా జెండాలను ప్రదర్శించారని ముస్లిం జేఏసీ ప్రతినిధి జవహర్ అలీ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన గురువారం కాకినాడలో ఆయన ముస్లిం జేఏసీ నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ర్యాలీలో యువకులు ప్రదర్శించిన జెండా కేవలం మతపరమైనవి తప్ప, పాకిస్థాన్, పాలస్తీనా జెండాలు ఏ మాత్రం కావని తెలిపారు. ర్యాలీ పూర్తిగా శాంతియుతంగా, సామరస్యపూర్వకంగా జరుగుతున్న సమయంలో కొందరు యువకులు తమకు తెలియకుండానే వీటిని ప్రదర్శించారని అన్నారు. కాకినాడలో ముస్లింలు ఎప్పటికీ దేశద్రోహం, విద్రోహ శక్తులకు అనుకూలంగా నిలబడే పరిస్థితి ఉండదని జవహర్ అలీ స్పష్టం చేశారు. పోలీసులు సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల ఆధారంగా కేసులు నమోదు చేశారని, ఎఫ్‌ఐఆర్‌లో వేసిన సెక్షన్లు 302 అండ్ 298, 126, 339, 281, 279ను తాము తీవ్రమైనవాటిగా పరిగణిస్తున్నామన్నారు. ప్రపంచంలో 96 ఇస్లామిక్ దేశాలున్నాయని, వాటికి సంబంధించి చంద్రుడు, చుక్క ఉన్న జెండాలు ప్రతి ముస్లింల ఇంట, మసీదుల వెంట ఉంటాయని మీడియాకు వివరించారు. పాలస్తీనాలో జరిగిన సంఘటనలకు మద్దతుగా మాత్రమే ఆ యువకులు తిరిగారని వెల్లడించారు. ఆకతాయి చర్యలుగా యువకులు తిరగడాన్ని తాము సమర్థించబోవడం లేదన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని సోషల్ మీడియాలో తమను దేశద్రోహులుగా, విద్రోహ శక్తుల ప్రతినిధులుగా చిత్రీకరించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

-18 సెల్‌ఫోన్లు, 200 నాణేలు, నగదు స్వాధీనం

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న 18 మందిని కాకినాడ త్రీటౌన్ పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.8,560 నగదు, సుమారు 200 నాణేలు, 18 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా కాకినాడ నగరంలోని పల్లంరాజు నగర్‌లో పవన్ గార్డెన్స్ అపార్ట్‌మెంట్స్ ఫ్లాట్ నెం.4లో జూదమాడుతున్నారని వచ్చిన పక్కా సమాచారంతో త్రీటౌన్ పోలీసులు, స్పెషల్ బ్రాంచి పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అనంతరం వారి నుంచి నగదు, నాణేలు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

కాపర్ వైర్ దొంగతనం .. ముగ్గురి అరెస్ట్

తొండంగి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి: ఒంటిమామిడి దివిస్ పరిశ్రమలో 1700 కిలోల కాపర్ వైర్ దొంగతనం చేసిన ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. దివీస్ ప్రతినిధులు ఈనెల 6న ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా పరిశ్రమలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన బిట్టుకుమార్, అభిషేక్ కుమార్, దీపక్‌కుమార్ చోరీకి పాల్పడినట్టు తేలిందన్నారు. రాత్రివేళ పలు దఫాలుగా రాగి తీగలను గోడపక్కన పడవేసి, తద్వారా వ్యాన్ సాయంతో స్థానికంగా స్క్రాప్ షాపు నడుపుతున్న వ్యక్తికి అమ్మేశారన్నారు. దీనిపై దర్యాప్తు జరిపి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు వారు తెలిపారు. తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అటవీ అమరవీరులను స్మరించుకోవాలి


అమరవీరులకు నివాళులర్పిస్తున్న అటవీఅధికార్లు, ఉద్యోగులు

సంస్మరణ దినోత్సవంలో రాజమహేంద్రవరం సీసీఎఫ్ మూర్తి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సంపదను కాపాడడం కోసం ప్రాణ త్యాగం చేసిన అటవీ అమరవీరులను ప్రతీఒక్కరు స్మరించుకోవాలని రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి అన్నారు. లాలాచెరువు సమీపంలోని గోదావరి మహా పుష్కరవనంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుష్కరవనంలోని అమరవీరుల స్థూపాల వద్ద సీసీఎఫ్ మూర్తి, దివాన్‌చెరువు సమీపంలోని రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్, జిల్లాలోని అటవీ అధికార్లు, ట్రైనీలతో కలసి అమరవీరులకు నివాళులర్పించారు. స్మారక స్థూపాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం సీసీఎఫ్ మూర్తి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడడంలో అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. విజయకుమార్ మాట్లాడుతూ సహజ వనరులను రక్షించడానికి అమరవీరులు చేసిన త్యాగాలను గుర్తు చేశారు, వాటిని మరువకూడదన్నారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో వి.ప్రభాకరరావు, ఫ్లైయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాస్, స్టేట్ సిల్వి కల్చరిస్ట్ శ్రీనివాస్, ఎఫ్ఆర్‌వో దావీదురాజు నాయుడు, డిప్యూటీ రేంజ్ అధికారి చల్లా శ్రీనివాసరావు, అటవీ ఉద్యోగులు, అటవీ అకాడమీలోని డిప్యూటీ డైరెక్టర్లు, ట్రైనీలు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ బదిలీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీఎఫ్‌డీసీఎల్) రీజనల్ మేనేజర్‌గా ఎస్.శ్రీకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన ఇంతవరకూ ఫారెస్ట్ రీసెర్చ్ అండ్ ఐటీ విభాగం చీఫ్ కన్జర్వేటర్‌గా పనిచేశారు. ఇక ఇక్కడ ఏపీ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న బి.విజయ కుమార్‌ను శ్రీశైలం ఫారెస్ట్ టైగర్ సర్కిల్ డైరెక్టర్‌గా నియమించారు.

పాము కాటుతో రైతు మృతి

అడ్డతీగల, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం దాకోడు గ్రామానికి చెందిన గిరిజన రైతు పొడుగు ప్రసాద్(41) పాముకాటుతో మృతి చెందాడు. ప్రసాద్ బుధవారం తన పొలంలో పనిచేసుకోవడానికి వెళుతుండగా మార్గమధ్యంలో పాముకాటేసింది. వెంటనే సహచరులు అతడిని దుప్పులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరిశీలించి ప్రసాద్ అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు.

పీఎఫ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రాంతీయ కమిషనర్ వెంకటేశ్వర్లు


వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న యూనివర్శిటీ అధికారులు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలని పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఆదికవి నన్నయ వర్శిటీలో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వర్శిటీలోని సిబ్బంది అందరూ పీఎఫ్‌లో భాగస్వాములవ్వాలని,దాని ద్వారా సొమ్ము ఆదా చేసుకోవడమే కాకుండా బీమా, పెన్షన్ ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకు రూ.లక్ష వరకూ వేతనం పొందే ఉద్యోగులు అర్హులన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎ.మట్టారెడ్డి, సిబ్బంది వెంకటేశ్వర్లు సన్మానించారు. అనంతరం వీసీ ప్రసన్నశ్రీని మర్యాదపూర్వకంగా కమిషనర్ కలవగా మాట్లాడుతూ ఈపీఎఫ్‌తో సిబ్బందికి మేలు కలిగే పలు అంశాలను చర్చించారు.

ఇంటి దొంగ అరెస్ట్

183 గ్రాముల బంగారు ఆభరణాలు రూ.లక్ష నగదు స్వాధీనం


వివరాలు వల్లడిస్తున్న సీఐ నాగదుర్గారావు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా పని చేస్తుందని ఎటువంటి నిఘా లేకుండా ఇల్లంతా ఆ పని మనిషికి అప్పగించి వృద్ధురాలైన ఆ యజమాని తన పని తాను చేసుకుంటోంది. ఆమె ఆదమరుపుగా ఉన్న సమయంలో పనిమనిషి ఆ ఇంటిలో ఉన్న 183 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరించుకుపోయింది. కట్ చేస్తే కాకినాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంది. సీఐ ఎం.నాగదుర్గారావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ బాలాజిచెరువు సెంటర్ సమీపంలోని కొమ్మిరెడ్డి వారి వీధిలో 60 ఏళ్ల బత్తుల కనకదుర్గ, ఆమె కుమార్తె ప్రశాంతి నివాసం ఉంటున్నా రు. ఈ నెల 2న ఆ ఇంటిలో 277 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష నగదు అపహరణకు గురైనట్టు కనకదుర్గ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ నాగదుర్గారావు, క్రైం సీఐ వి.కృష్ణ బృందంతో కలిసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆ ఇంటి పని మనిషిని నిందితురాలిగా నిర్ధారించారు. గురువారం స్థానిక జగన్నాథపురం, మరిడమ్మపేటకు చెందిన పని మనిషి వనమాడి జగదాంబను ఆమె ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. కనకదుర్గ ఇంట్లోని డబుల్ కాట్ మంచానికి అమర్చిన సీక్రెట్ సొరుగులో ఆమె విలువైన వస్తువులు భద్రపరుస్తుండడాన్ని చాలాకాలంగా జగదాంబ గమనించేది. ఈ నెల 2న ప్రశాంతి బయటకు వెళ్లగా కనకదుర్గ పని చేసుకుంటోంది. ఆ సమయంలో జగదాంబ దొంగతనానికి పాల్పడింది. అయితే బాధితులు ఆందోళనలో ఉండి ఫిర్యాదులో 277 గ్రాముల బంగారం చోరీకి గురైనట్టు తెలిపిందని అయితే 94 గ్రాముల బంగారం కనకదుర్గ ఇంటిలో భద్రంగానే ఉన్నట్టు గుర్తించామన్నారు. నిందితురాలిని అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

డొంకరాయి నుంచి నీటి విడుదల నిలుపుదల


డొంకరాయి జలాశయం నుంచి నీటిని నిలుపుదల చేసిన దృశ్యం

జెన్‌కో అధికారులు

మోతుగూడెం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు కాంప్లెక్సు పరిధిలోని జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల ఈ ప్రాంతంలో కురిసిన భారీవర్షాలకు డొంకరాయి జలాశయం పూర్తిస్థాయికి చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులుగా కాగా ఈ నెల 5 నాటికి 1035.60 అడుగులకు చేరడంతో జలాశయం నీటి మట్టం పూర్తిస్థాయి చేరుకుంటే ప్రమాదమని భావించి స్థానిక జెన్‌కో అధికార్లు ముందస్తు చర్యల్లో భాగంగా 5వ తేదీ రాత్రి జలాశయం 6వ గేటు ఎత్తి దిగువకు 3 వేలు క్యూసెక్కుల నీటిని విడుదల చేసి నీటి మట్టం 1034 అడుగుల వద్ద స్థిరంగా కొనసాగేలా చర్యలు చేపట్టారు. 4రోజులుగా ఈ ప్రాంతంలో వరద తగ్గుముఖం పట్టింది. దీంతో గురువారం ఉదయం నాటికి డొంకరాయి జలాశయం నీటిమట్టం 1033.90 అడుగులకు తగ్గడంతో నీటి విడుదలను గురువారం ఉదయం నుంచి నిలిపివేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. ఈ నెల 5నుంచి 11వ తేదీ ఉదయం వరకు 759 టీఎం సీల నీటిని దిగువకు విడుదల చేశామని తెలిపారు.అలాగే డొంకరాయి జలాశయం నుంచి పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం 3519 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్టు జెన్‌కో అధికార్లు తెలిపారు. అల్పపీడన ప్రభావంతో ఇటీవల సీలేరు నదీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సీలేరు కాంప్లెక్సు లోని జలాశయాలకు నీటిని సరఫరా చేసే ఆంధ్రా ఒడిశా ఉమ్మడి జలాశయమైన బలిమెల జలాశయంలో ఆంధ్రా వాటాగా గురువారం నాటికి 45.9236 టీఎంసీలు, సీలేరు డొంకరాయి జలాశయాల్లో 12.9701 టీఎంసీలుతో కలుపుకుని మొత్తంగా 58.8937 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయని జెన్‌కో అధికారులు తెలిపారు. గురువారం సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ అధికార్ల ఆదేశాలతో 3.7038మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని స్థానిక అధికార్లు తెలిపారు.

వలసపాకల యూఆర్సీ క్యాంటీన్‌లో వివాదం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకల యూనిట్ రన్ క్యాంటీన్ (యూఆర్సీ)లో పనిచేస్తున్న మేనేజర్, ఓ ఉన్నతాధికారి మధ్య తలెత్తిన వివాదం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే వరకు వెళ్లింది. వివరాల్లోకెళితే... కాకినాడ జిల్లాలో పని చేస్తున్న ఆర్మీ సిబ్బంది, రిటైర్డు ఆర్మీ ఉద్యోగస్థులకు రాయితీపై నిత్యావసర సరుకులు, ఎలక్ట్రిక్ పరికరాలను వలసపాకలలో ఏర్పాటుచేసిన ఆర్మీ క్యాంటీన్‌లో పంపిణీ చేస్తారు.కాకినాడకు చెందిన ఆర్మీ ఉన్నతాధికారి ఆగస్టు 22న క్యాంటీన్‌ని సందర్శించిన సమయంలో దాని నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేసి, తనపై అకారణంగా ఆగ్రహం వ్యక్తం చేసినట్టు అక్కడ పని చేస్తున్న మేనేజర్.. సన్నిహితులు, సహచార ఉద్యోగస్థుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.ఏ తప్పు చేయకపోయినా తనపై ఆ అధికారి దురుసుగా ప్రవర్తించడంతో వారం క్రితం రాజీనామా చేశారు. రాజీనామా వెనక్కి తీసుకోవాలని రిటైర్డు ఆర్మీ సంఘం నాయకులు సదరు మేనేజర్‌కు సంఘీభావం తెలపడంతో రాజీనామా వెనక్కి తీసుకుంటున్నట్టు మేనేజర్ సికింద్రాబాద్‌లోని ఆర్మీ సెంట్రల్ హెడ్ క్వార్టర్‌కి సమాచారం అందించి, విధుల్లో చేరే నిమిత్తం ఆర్మీ క్యాంటీన్‌లో విధులు నిర్వర్తించేందుకు వచ్చినా సదరు అధికారి అడుకోవడంపై మేనేజర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన రాజీనామా ఆమోదించినట్టు తనకు హెడ్ క్వార్టర్స్ నుంచి ఎటువంటి ఉత్తర్వులు అందలేదని, అయినప్పటికీ సదరు కల్నల్ తనను అడ్డగిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు 8 మంది


రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్, చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు బిక్కవోలు నుంచి నలుగురు బాలురు, నలుగురు బాలికలు ఎంపికయ్యారని బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు ఐ.శశిభూషణం గురువారం తెలిపారు.ఇటీవల గొల్లల మామిడాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-19 పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారిలో దుళ్ల అలేఖ్య, బండారు చాందినిశ్రీయ, రొంగల శిరీష, బూడి భార్గవి, విసినిగిరి హేమంత్, కైలాష్, తొండాపు వీరమణికంఠ, గుత్తుల నాగవినయ్ ఉన్నారు. వారు ఈ నెల 12 నుంచి 14 వరకూ అనంతపురం జిల్లా ధర్మవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన బాలబాలికలను అసోసియేషన్ సభ్యులు చైతన్య, నరేంద్ర, కృష్ణ ప్రసాద్, మోహన్ అభినందించారు.

చెస్ పోటీలకు ఇద్దరు ...

పందలపాక జడ్పీ ప్లస్ పాఠశాల నుంచి ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 చెస్ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పి.లీలాస్వాతి, జి.విమల ప్రతిభ కనబరచిన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.ఈ సందర్భగా విద్యార్థినులతోపాటు పీడీ యువరాజారెడ్డిని హెచ్‌ఎం, ఎస్‌డీసీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఎస్ఎంసీ చైర్మన్ పంపన వీరసత్యనారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

బైక్ చోరీ చేస్తూ గ్రామస్థులకు చిక్కిన దొంగ

రాజానగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోనగూడెంలో బైక్ చోరీకి పాల్పడుతూ ఒక దొంగ గ్రామస్థులకు చిక్కడంతో అతడికి దేహశుద్ధి చేసి, నిర్బంధించారు. గ్రామంలోని టీ దుకాణం వద్ద పార్క్ చేసిన బైక్ చెంతన ముగ్గురు యువకులు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గమనించారు. కొంతసేపటికి తాళం తీసేందుకు ప్రయత్నిస్తుండగా దొంగను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఇద్దరు పరారుకాగా ఒకడు పట్టుబడ్డాడు. అతడికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. ఎన్ని విధాలుగా భయపెట్టినప్పటికీ నోటి నుంచి సరైన సమాధానం రాబట్టలేకపోయారు. చేసేది లేక పోలీసులకు సమాచారం అందించారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసు శ్రీకారం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 48వ డివిజన్ పరిధిలోని సీటీఆర్ఐ ఆటోస్టాండ్ నుంచి 5వ నెంబరు బస్టాండ్ వరకు రూ.30 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించి నగరంలో మరో రూ.20 కోట్ల అంచనా వ్యయంతో పనులకు టెండర్లు పిలిచామన్నారు. రాజమహేంద్రవరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి కల్చరల్ క్యాపిటల్‌గా ఉన్న నగరాన్ని టూరిజం హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రూ.8 కోట్లతో రివర్‌ఫ్రంట్ అప్పర్ ప్రామినేడ్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ14 కోట్లతో లోయర్ ప్రామినేడ్ పనులను కూడా త్వరలో ప్రారంభించుకుంటామన్నారు. 2027 పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పార్టీలు, రాష్ట్రంలో వైసీపీ.. అన్నీ ఒకటేనని అన్నారు. వైసీపీ అధినేత జగన్‌కు దమ్ముంటే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో తన పార్టీ ఎంపీలతో ఎన్‌డీఏ అభ్యర్థికి వ్యతిరేకంగా ఓటు వేయించాలని, కాని అలా చేయలేదన్నారు. దేశ ప్రధాని మోదీ మాట జవదాటకుండా ఈ పార్టీలన్నీ పనిచేస్తున్నాయన్నారు. అందుకే దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సూపర్ సిక్స్‌లో స్త్రీశక్తి, తల్లికి వందనం తప్ప ఏ పథకం అమలు చేయలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో లేని అన్న క్యాంటీన్‌ను అమలు చేశారన్నారు. మెడికల్ కాలేజీల సీట్లు అమ్ముకుని జగన్ తప్పు చేస్తే.. పీపీపీ మోడ్ అంటూ ప్రైవేట్ పరం చేసి సీఎం చంద్రబాబు తప్పు చేస్తున్నాడన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అమలు చేయడం లేదని, జగన్ హయాంలో రద్దు చేసిన 26 ఎస్సీ పథకాలను పునరుద్ధరించలేదని, ఇంకా హామీ ఇచ్చిన అనేక వాటిని నెరవేర్చలేకపోయారని అన్నారు. సమావేశంలో జీవీ సుందర్ పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై యువత, విద్యార్థులు పోరాటం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా పాలకుల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా విద్యార్థులు, యువత పెద్దఎత్తున పోరాటంలోకి వస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహన్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా స్థాయి సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. నేపాల్‌లో జరుగుతున్న జెన్ జీ జనరేషన్ నిరసన, కొన్ని నెలల క్రితం శ్రీలంకలో అమలైన ప్రజావ్యతిరేక విధానాలకు యువత, విద్యార్థులు తీవ్రస్థాయిలో నిరసనలు తెలియజేశారని అన్నారు. ఆ దేశాల్లో కంటే మన దేశంలో యువత, విద్యార్థులు ఉద్యోగాలు లేక, చదువుకోవడానికి సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యువత, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వాలు తక్షణం పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.భాస్కర్, ఎన్.రాజా తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా ఐదుగురు సభ్యులను నూతన కమిటీలోకి తీసుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులు, నగర నాయకులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలకు జట్ల సంఘం కార్మికులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పంజాబ్ రాజధాని చండీఘడ్‌లో ఈనెల 21 నుంచి 25 వరకూ జరగనున్న సీపీఐ జాతీయ మహాసభల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి రెండు బస్సుల్లో జట్ల లేబర్ యూనియన్ కార్మికులు బయలుదేరి వెళ్లారని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. గురువారం ఈ రెండు బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నుంచి దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి అన్ని వామపక్ష పార్టీలను ఏకతాటిపైకి తీసుకురావడానికి ఈ మహాసభలు దోహదం చేస్తాయన్నారు. యూనియన్ అధ్యక్షుడు కూండ్రపు రాంబాబు మాట్లాడుతూ జట్ల లేబర్ యూనియన్ సభ్యులు 100 మంది మొదటి రోజు ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, సీపీఐ నగర కార్యదర్శి కొండలరావు,తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ సత్యనారాయణ జయంతి


సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కళా ప్రపూర్ణ విశ్వనాథ సత్యనారాయణ జయంతిని స్థానిక జేఎన్ రోడ్డులోని ఆంధ్ర కేసరి డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుతనానికే కళా ప్రపూర్ణుడు విశ్వనాథ అని, ఆయన రాసిన వేయి పడగల నవలను భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు హిందీలోకి అనువదించారని గుర్తు చేశారు. కళాశాల కార్యదర్శి జిరమణయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేశిరెడ్డి బలరామనాయుడు, ప్రిన్సిపాల్ రవికిరణ్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్లపల్లి హైస్కూల్లో అవార్డు గ్రహీతకు సత్కారం

బిక్కవోలు, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శారదాజ్యోతి ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన సందర్భంగా గురువారం హెచ్‌ఎం పి.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన ఆమెకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శారదాజ్యోతి భవిష్యత్తులో మరెన్నో అవార్డులు స్వీకరించి, విద్యార్థులను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీపీ తేతలి సుమ కోరారు. అనంతరం శారదాజ్యోతి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తనుకు శ్రీధర్, కానాటి అప్పలస్వామి, తేతలి సూర్యచంద్ర, పంచాయతీ కార్యదర్శి వంశీ, స్టాఫ్ సెక్రటరీ ఈశ్వరరెడ్డి, ఎస్టీయూ, యూటీఎఫ్ మండలాధ్యక్షులు సత్యనారాయణ, గోవిందరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదానం


రక్తదాతను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 265 మంది తిరుమల విద్యాసంస్థల సిబ్బంది రక్తదానం చేశారు. తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు పుట్టిన రోజు సందర్భంగా సంస్థ ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఎన్టీఆర్ ట్రస్ట్, డాక్టర్ వైఎస్ఆర్ అండ్ జక్కంపూడి బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో రక్తదానం చేసిన వారిని తిరుమలరావు అభినందించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో పోటీపడుతున్న ఈ ప్రపంచంలో మనిషి నుంచి మాత్రమే రక్తం లభిస్తుందని దానికి వేరే మార్గాలు ఏమిలేవని అపోహలతో రక్తదానం చేయడానికి వెనుకాడుతున్న వాళ్లందరూ ముందుకొచ్చి రక్తదానం చేసి ప్రాణాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో నున్న కృష్ణ, నున్న సు రేష్, జక్కంపూడి రాజశ్రీ, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ శ్రీహరి, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్టిక్ మనోహర్‌కు జాతీయ అవార్డు



జాతీయ అవార్డు అందుకున్న స్టిక్ మనోహర్

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ మెజీషియన్ ఎస్.మనోహరరావు (స్టిక్ మనోహర్)కు తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మెమోరియల్ ఫస్ట్ నేషనల్ అవార్డు-2025లో బెస్ట్ సైకలాజికల్ మెజీషియన్ అవార్డును ప్రదానం చేశారు.రాజమహేంద్రవరానికి చెందిన స్టిక్ మనోహర్‌కు జాతీయ అవార్డు రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ అవార్డును హైదరాబాద్‌లో తెలంగాణ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ చేతుల మీదుగా మనోహర్ అందుకున్నారు.

సమస్యలు పరిష్కరించండి


సీతానగరంలో అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం


కోరుకొండలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

విలేజ్, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎంపీడీవోలకు వినతిపత్రాల సమర్పణ

బిక్కవోలు/కోరుకొండ/సీతానగరం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ విలేజ్ వార్డ్ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం (ఏపీవీడబ్ల్యూఎస్ జీఈఏ) డిమాండ్ చేసింది. సంఘ సభ్యులు మాట్లాడుతూ ఇంటింటి సర్వేలు, అదనపు పనుల పేరుతో సచివాలయ ఉద్యోగులను ప్రధాన విధుల నుంచి తప్పిస్తున్నారని, ఇది ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజలకు సేవ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నప్పటికీ, అసాధారణమైన పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నామన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే తమకు సకాలంలో ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, జూనియర్ అసిస్టెంట్‌కు సమానమైన హోదాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు 10 గంటల పనివేళల నిబంధన అమలు చేయకపోవడం, సెలవు రోజుల్లో కూడా బలవంతంగా పనిచేయమని ఒత్తిడి చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు బిక్కవోలులో సచివాలయ ఉద్యోగుల అనపర్తి తాలూకా అధ్యక్షుడు తాడి రామగురెడ్డి మండల ఉద్యోగులతో కలిసి వినతిపత్రాన్ని ఎంపీడీవో వి.శ్రీనివాస్‌కు అందజేశారు.సీతానగరంలో ఏపీవీడబ్ల్యూఎస్‌జీఈఏ జిల్లా కో కన్వీనర్ బాలరజని ఆధ్వర్యంలో ఉద్యోగులు ఇన్‌చార్జి ఎంపీడీవో మూర్తికి వినతిపత్రం అందించగా కోరుకొండలో ఎంపీడీవోకు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సంఘం నిర్ణయం మేరకు ఈ ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినట్టు పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి సహకరించండి

రంగంపేట పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి

రంగంపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రుల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బి.వేణుశ్రీ లక్ష్మీ అధ్యక్షతన జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆసుపత్రి అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కొంత సమయం కేటాయించాలన్నారు. అందరూ భాగస్వాములుగా ఉండాలన్నారు. అలాగే పీ4 కార్యక్రమంలో కూడా అందరూ భాగస్వాములు కావాలని, కూటమి నాయకులు ప్రథమపాత్ర పోషించాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో తహశీల్దార్ కోసు అనసూయ, కూటమి నాయకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.


రంగంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

శాశ్వత భవన నిర్మాణానికి కృషి


కడియపులంక సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రసాద్

కడియం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కడియపులంకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాశ్వత భవన నిర్మాణానికి సహకారం అందిస్తామని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ తాత్కాలిక భవనంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తొలి సమావేశం అధ్యక్షుడు వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో మౌలిక వసతులు, మందుల సరఫరా, సిబ్బంది నియామకం, వ్యాధినిరోధక టీకాల నిల్వలకు కావాల్సిన ఫ్రీజ ర్లు ఏర్పాటు వంటి వాటిని కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రసాద్ అన్నారు. ఇందుకోసం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి లేఖ రాయడం, శాశ్వత భవనం నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు ఆర్అండ్‌బీ ఈఈకి లేఖ రాసేందుకు చేసిన తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎన్.జెస్సీ సుప్రియ, డాక్టర్ ఎన్.నాగసాయిమౌర్య,అధికారులు, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీఆర్వోకు ఆర్డీవో పరామర్శ



కోరుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటి గ్రామ సచివాలయం వీఆర్వో దయానందస్వామి ఇటీవల బైక్ ప్రమాదానికి గురై ప్రస్తుతం రాజమహేంద్రవరం శ్రీకర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం ఆర్డీవో కృష్ణనాయక్ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, అతడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్సకు అయ్యే ఖర్చుల విషయంలో హాస్పిటల్ యాజమాన్యం రాయితీ కల్పించాలని కోరారు.

శాస్త్ర ప్రదర్శనకు ఆర్ట్స్ అధ్యాపకులు, విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో 'దేశ సేవలో అణువులు' అనే అంశంపై పీబీ సిద్ధార్థ కళాశాల నిర్వహించిన ఐదు రోజుల శాస్త్ర ప్రదర్శనలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. దేశంలోని ప్రముఖ అణు పరిశోధనా కేంద్రాల్లో ఒకటైన తమిళనాడులోని కల్పక్కంలో ఉన్న ఇందిరాగాంధీ అణు పరిశోధనా కేంద్రం భాగస్వామ్యంతో దీన్ని నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాస్త్రీయ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి ఆధునిక పరిశోధనలు, ప్రయోగాలను వీక్షించారని పేర్కొన్నారు.

కొంకుదురులో గణపతి హోమం

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కొంకుదురు మంచినీటి చెరువు వద్ద గణపతి ఆలయంలో గురువారం ఘనంగా లక్ష గరిక పూజ, గణపతి హోమం నిర్వహించారు.అనంతరం భారీ అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సెక్యూరిటీ సిబ్బంది హాజరు పరిశీలన

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)లో పనిచేసే సెక్యూరిటీ సిబ్బంది హాజరును గురువారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి పరిశీలించారు. అధికారుల నుంచి హాజరు రికార్డులను తీసుకుని, వాటిని దగ్గర పెట్టుకుని వ్యక్తిగతంగా సిబ్బంది ఎఫ్ఆర్ఎస్‌ను ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో బీ షిఫ్టులో సెక్యూరిటీ సిబ్బంది డ్యూటీలకు వెళ్లే సమయంలో ఆయన ఈ హాజరు తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్కరినీ పేరు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా డ్యూటీకి రాకపోతే కారణాలపై ఆరా తీశారు. జీజీహెచ్‌లో శానిటేషన్, సెక్యూరిటీ నిర్వహణలకు సంబంధించి జీజీహెచ్ అధికారులతో కలెక్టర్ ప్రశాంతి ఇటీవల వరుస సమీక్షల నేపథ్యంలో అనేక లొసుగులు వెలుగు చూస్తుండడంతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కరరెడ్డి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.

విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు అందజేత

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు హౌసింగ్ బోర్డుకాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సంస్థ స్టీల్‌ప్లేట్లు, నోట్ పుస్తకాలు, బిస్కట్లు, చిక్కీలను గురువారం అందజేసింది. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసేందుకు స్టీల్‌ప్లేట్లును అందజేశారు. మానవత స్వచ్ఛంధ సంస్థ అధ్యక్షుడు బి.మురళి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఎదగాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎల్‌వీ రమేష్, సంస్థ ఉపాధ్యక్షుడు వెచ్చా మధు (మెహర్‌మధు), గాంధీ, రుద్రమదేవి, టి.రవి పాల్గొన్నారు.

భారత్‌కో జానో క్విజ్‌పోటీలు


బహుమతులు అందుకున్న విజేతలు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమీ గ్రంథాలయంలో గురువారం రాజమహేంద్రవరంలోని భారత్ వికాస్ పరిషత్ మూడు శాఖలు సంయుక్తంగా భారత్‌కో జానో క్విజ్ పోటీలు నిర్వహించాయి. గ్రంథాలయ లైబ్రరియన్ జి.శ్రీదేవి, బీవీపీ రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ నారాయణ, రాష్ట్ర కోశాధికారి టి.సాయికృష్ణ,సౌత్ రీజనల్ సెక్రటరీ డిపురుషోత్తమ శాస్త్రి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో క్విజ్ మాస్టర్‌గా స్వామినాథన్ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నేడు దివ్యాంగ పిల్లలకు వైద్యశిబిరం

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం దివ్యాంగు పిల్లలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ఈ క్యాంపుకు దివ్యాంగ పిల్లలను తీసుకువచ్చేటప్పుడు పిల్లల ఆధార్, రేషన్‌కార్డు, సదరం ధ్రువపత్రం, ఫొటోలు, యూడీఐడీ కార్డు ఒరిజినల్స్‌తో పాటు జెరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. శిబిరంలో పిల్లలకు పరీక్షలు జరిపి వారికి అవసరమైన ఉపకరణాలకు ప్రతిపాదనలు చేస్తారన్నారు.

వివాహిత అదృశ్యం

రాజానగరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొం తమూరుకు చెందిన ఓ వివాహిత అదృశ్యమై నట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామా నికి చెందిన ఆకాశపు మోహన్‌కుమార్ తన భార్య శిరీష నాలుగేళ్ల వయసున్న జైదీప్ వీర, ఏడాది వయస్సున్న మోక్ష శ్రీవీరలతో కలిసి గురువారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 83284 68687; 94407 96585 నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని పేర్కొన్నారు.

'వెంకయ్యపేటను ప్రత్యేక పంచాయతీ చేయండి'

కడియం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): కడియపులంక పంచాయతీలో కడియపులంక, బుర్రిలంకతో పాటు వెంకయ్యపేట విలీనంగా ఉందని, తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా తీర్మానం చేయాలని వెంకయ్యపేట గ్రామస్థులు గురువారం సర్పంచ్ మాదిశెట్టి పద్మావతిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామసభ ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని కోరారు.

దారి చూపడాన్ని మరోసారి పరిశీలించండి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): తమ పొలంలో నుంచి డి.పట్టా భూమిలోకి చూపిన నడకదారిని పునః పరిశీలించి, దారి చూపించడాన్ని రద్దు చేయాలని భూపాలపట్నానికి చెందిన గంగుమళ్ల వీరబాబు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆర్డీవోను కలిసి కోరినట్టు గురువారం తెలిపారు. యడ్ల ఏసయ్యకు తమపొలంలో నుంచి దారి లేదన్నారు. కాని స.నెం285/5లో నుంచి ఏసయ్య డి.పట్టాభూమి స.నెం286/1 లోపలికి మూడడుగుల నడకదారిని చూపారని, దానిని రద్దు చేయాలని కోరానన్నారు.



ధవళేశ్వరంలో కార్డన్‌సెర్చ్

ఒక్క రాత్రి.. 462 కేసులు : ఎస్పీ

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): రాత్రి వేళల్లో అనవసరంగా, ఆవారాగా తిరిగే వాళ్లపై ఉక్కుపాదం తప్పదని ఎస్పీ నరసింహ కిశోర్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులను అప్రమత్తం చేశామని తనిఖీలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం రాత్రి వాహన తనిఖీలు చేసి 462 కేసులు నమోదు చేశామన్నారు.రికార్డులు సరిగా లేని వాహనా లపై 42, మద్యం సేవించి వాహనం నడిపిన వారిపై 9, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై 140 కేసులు నమోదు చేశామన్నారు. ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి ఎఫ్‌సీఐ గొడౌన్స్ సమీపంలో ఉన్న రాజీవ్ నగర్ కాలనీలో గురువారం ఉదయం దక్షిణ మండల డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ హరిబాబు సిబ్బంది, శక్తి టీం, స్పెషల్ పార్టీ పోలీసులుతో కలసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు.13 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

పొగాకు మడుల్లో యూరియా వాడకూడదు

సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు



దేవరపల్లి మండలం పల్లంట్లలో పొగాకు నారుమడిని పరిశీలిస్తున్న సీటీఆర్ఐ శాస్త్రవేత్తలు

దేవరపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే పొగాకు నారు మడులు పెంపకం ఎంతో కీలకమైందని సీటీఆర్ఐ శాస్త్రవేత్త ప్రభాకరరావు అన్నారు. దేవరపల్లి మండలం పల్లంట్ల లో గురువారం పొగాకు రైతులతో సమావేశం అనంతరం పొగాకు నారుమడులను సీటీఆర్ శాస్త్రవేత్తలు, పొగాకు బోర్డు అధికారులు పరిశీలించి మాట్లాడారు. ప్రతి రైతు నారుమడులు కట్టే దశలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. అధిక దిగుబడినిచ్చే పొగాకు విత్తనా లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. నారుమడి పెంపకంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నారుమడుల్లో యూరియా వాడకూడదని అమోనియ సల్ఫేట్ వాడాలని సూచించారు. రాజమహేంద్రవరం పొగాకు బోర్డు రీజనల్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ పొగాకు బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పంటసాగు చేయాలన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి హేమస్మిత, ఫీల్డ్ ఆఫీసర్లు వినోద్, ప్రజాపతి, రైతులు గన్నమని ప్రసాద్, గంగాధర్, యలమాటి సురేశ్, బాబ్జీ, నలమాటి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంలో జిల్లాకు ప్రథమం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర విజన్ - 2047 కార్యక్రమానికి సంబంధించి ప్రజారోగ్యంలో 92 శాతం పనితీరు సాధించి తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచిందని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పిల్లలకు పూర్తి టీకాలు, శిశు మరణాల రేటు తగ్గుదల, నవజాత శిశు మరణాలరేటు, మాతృమరణాల రేటు, గర్భిణీల్లో రక్తహీనత నివారణ, జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల సౌకర్యాలు, ఎన్‌సీడీ ఫాలోఅప్, క్షయరోగం విజయవంతమైన చికిత్స రేటు, డెంగీ మరణాల నిష్పత్తి తగ్గింపు తదితర కీలక పనితీరు సూచికల్లో ఏ ప్లస్ రేటింగ్ సాధించిందన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

యూరియా సరఫరాకు టోకెన్ విధానం : కలెక్టర్

కోరుకొండ, సెప్టెంబరు 11 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని, టోకెన్ విధానం ద్వారా ప్రతి రైతుకు యూరియా సరఫరా జరుగుతోందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శ్రీరంగ పట్నం ప్యాక్ సొసైటీలో గురువారం రైతులతో కలెక్టర్ ముఖాముఖి సమావేశం నిర్వహించారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రస్తుతం రైతులు ఎకరాకు 4-5 బస్తాల యూరియాను వాడుతున్నారని, వాస్తవానికి 50 నుంచి 60 కిలోల వరకు మాత్రమే మూడు దశల్లో వినియోగిస్తే సరిపోతుందన్నారు. పంటకు సగ భాగం యూరియా.. మిగిలిన సగ భాగం నానో యూరియా వాడాలని సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ పనులకు వచ్చే కూలీలు తప్పుడు పద్ధతుల వల్ల యూరియా దుర్వి నియోగమవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, శ్రీరంగపట్నం ప్యాక్ సొసైటీ అధ్యక్షుడు గణపతి స్వామి, పాల్గొన్నారు.

'అనవసరంగా యూరియా వాడొద్దు'

రాజమహేంద్రవరం రూరల్ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అవసరా నికి మించి యూరియా వాడకం వల్ల నేల సహజ స్వభావం కోల్పోతుందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు అన్నారు. రాజవోలు సొసైటీలో నానో యూరియాపై అవగాహన కల్పించారు. సంప్రదాయ యూరియాకు బదులు నానో యూరియా వాడాలన్నారు. 45 కేజీల యూరియా బస్తాకు అర లీటరు నానో యూరియా సమా నంగా పనిచేస్తుందన్నారు. యూరియాకు బదులుగా సహజంగా దొరికే ఆవుపేడ,ఆవు మూత్రంతో ద్రవ,ఘన జీవామృతం వినియోగించి పలు పంటలు పండించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ శ్రీనివాసరెడ్డి, ఏవో పీటర్ పాల్గొన్నారు

దొంగా.. పోలీస్!



పోలీసుల స్వాధీనంలోని వాహనాలు మాయం

- స్టేషన్‌కు వెళితే సామగ్రి ఖాళీ
- టైర్లు, బ్యాటరీలకు రెక్కలు
- స్టేషన్లలో చోరశిఖామణులు
- రాత్రి వేళ పోలీసుల అతి
- గస్తీ పేరిట సాగుతున్న దందా
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఉన్నతాధికారుల చర్యలు నిల్

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇంటి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం కనబడ లేదంటే దొంగల పని అనుకోవచ్చు. కానీ పోలీసుల స్వాధీనంలో ఉన్న వాహనాలు మాయమైపోతున్నాయంటే ఏ పేరు పెట్టాలో వారే చెప్పాలి. పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న వాహనాలు యజమాని చేతికి తిరిగి చేరితే అదృష్టమనే చెప్పాలి. జరిమానా చెల్లించినా బండి మాత్రం మనుగడ స్థితిలో ఉందో లేదో తెలియని పరిస్థితి దాపురించింది. యూనిఫాం సిగ్గుపడేలా కొందరు ఖాకీలు దిగజారిపోవడంతో పోలీస్ శాఖ పరువు బజారున పడుతోంది.

ఆ బైక్ ఏమైందో..

పోలీసులు తనిఖీలు చేసే సమయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుంటారు. ఇలా పలు కేసుల్లో స్టేషన్‌కు చేర్చే వాహనాలు ఉంటాయి. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, క్రైమ్ ఇలా పలు విభాగాల పోలీసులు చిక్కిన కాడికి ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు చేరుస్తుంటారు. కొన్నింటిని చేయి తడిపితే వదిలేస్తుంటారు. ఆ తంతును పక్కన పెడితే.. జిల్లా వ్యాప్తంగా ఏ స్టేషన్‌లో చూసినా 100 బైక్‌లకు పైనే ఉంటాయి. వీటికి తోడు కార్లు, లారీలు ఏళ్ల తరబడి తుక్కులో కలిసిపోతాయి. పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు స్టేషన్ నుంచి పరారైపోతున్నాయి. తాజా ఘటన చూస్తే. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఓ ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై దేవీచౌక్‌లోని మెడికల్ షాపునకు వెళ్లారు. మందులు తీసుకొని తిరిగి వెళదామని బైక్ ఎక్కారు. రయ్‌మని పోలీస్ జీపు వచ్చి వాళ్లకు అడ్డంగా ఆగింది. ఓ పోలీసు జీపు దిగి ఒక్క ఉదుటున సాహసంగా వెళ్లి ఆ బైక్ తాళాలు లాక్కున్నారు. భవానీపురం నుంచి మందుల కోసం వచ్చామని, అర్జెంటుగా తీసుకెళ్లాలని కాళ్లావేళ్లా పడినా కనికరించలేదు. ఉదయం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి జరిమానా చెల్లించి బైక్ తీసుకెళ్లాలని చెప్పారు. ఉసూరుమంటూ ఇంటి దారి పట్టిన ఆ యువకులు.. మరుసటి రోజు ఉదయం స్టేషన్‌కు వెళ్లి రూ.500 జరిమానా చెల్లించారు. కొన్ని తాళాలు టేబుల్‌పై వేసి వాళ్ల బండి తాళాన్ని వెతుక్కోమన్నారు. ఎంత వెతికినా తాళం కనిపించలేదు, బయటకు వెళ్లి చూడగా బండీ లేదు. దీంతో కంగారుపడిన ఆ పోలీసులు జరిమానా రశీదు వెనక్కి తీసుకొని డబ్బులు తిరిగిచ్చేశారు. బండి ఎక్కడుందో వెతుక్కోమని పరీక్ష పెట్టారు. దీంతో ఆ యువకులు ట్రాఫిక్, క్రైం, లా అండ్ ఆర్డర్ స్టేషన్ల చుట్టూ రెండు రోజులు తిరిగినా ఫలితం లేకపోయింది. ఫిర్యాదు చేస్తే వెతుకుతామంటూ పోలీసులే సలహా ఇవ్వడంతో ఆ బైక్ యజమానికి బుర్ర తిరిగినంత పనైంది. ఎవరితో చెప్పుకోవాలో తెలియక లబోదిబోమంటున్నాడు.

విడిభాగాలు హుష్‌కాకి..

ఏదైనా బైక్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లిందంటే విడిభాగాలకు గ్యారంటీ ఉండదు. ఒక రెండు రోజులు బైక్ స్టేషన్ వద్ద వదిలేస్తే వాహన సామగ్రి అంతా మాయం చేయగల సిద్ధహస్తులుంటారు.. ఇదేదో దొంగల పనికాదండోయ్.. ఖాకీ ముసుగులో ఉన్న పోలీసుల పనే. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల్లో కొన్ని పెద్ద కేసుల్లో కోర్టు ఆదేశాలు పాటించాల్సి ఉంటుంది.చిన్న కేసుల్లో అధిక సంఖ్యలో వాహనాలు స్టేషన్‌కు చేరుతూ ఉంటాయి. కేసు కట్టి ఆ యజమానిని కోర్టులో ప్రవేశపెడితే జరిమానా వేస్తారు. ఆ జరిమానా చెల్లించి.. కొంత సొమ్ము ఖాకీ జేబులో పెడితే గానీ బండి, దాని తాలూకా తాళం చెవి కనిపించదు. కొన్ని కేసుల్లోని వాహనాలను తగు ప్రక్రియతో వేలం నిర్వహించవచ్చు. అటువంటి వాహనాల విడిభాగాలకు రెక్కలు వస్తుంటాయి.బ్యాటరీ, టైర్లు, ఇంజన్, హెడ్‌లైటు.. చివరికి సిగ్నల్ లైట్లను కూడా విప్పేసి పట్టుకుపోతారు. ఈ పని ఖాకీలే చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మితిమీరుతున్న దందా..

కొందరు ఖాకీల వల్ల జనాల తిట్లు తప్పడం లేదు. రాత్రి వేళల్లో పోలీసుల దందా మరీ మితిమీరుతోంది. ప్రయాణికులను సైతం ఆపేసి ఏవేవో ప్రశ్నలతో మానసిక వేదనకు గురి చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలకు కనీసం రశీదు ఇవ్వరు. వాళ్ల ఐడెంటిటీ.. అంటే పేరు, హోదా, పని చేస్తున్న ప్రదేశం వంటివి కూడా చెప్పరు. అధికారులు ఉంటే వారి హోదా, స్టేషను తెలిసిపోతుంది. కానీ సిబ్బంది విషయంలో ఇబ్బంది ఏర్పడుతోంది. బండి తీసుకొని, ఉదయం స్టేషనుకురా అని చెప్పేసి పంపేస్తారు. తర్వాత ఆ బండి ఎక్కడకు వెళుతుందో, అన్ని అవయవాలతో ఉంటుందో లేదో తెలియని పరిస్థితి ఉంది. గతంలో స్వాధీనంలో ఉన్న వాహనాలు అమ్మేసుకున్నారనే ఆరోపణలు ఓ సీఐపై వచ్చాయి. ఇలాంటివి పరిపాటిగా మారిపోయాయి. దీంతో తమ వాహనం స్వాధీనం చేసుకున్నది పోలీసా? దొంగా? అనే అనుమానాన్ని బాధితులు వ్యక్తం చేస్తున్నారు. అసలు ఆయా పోలీసు స్టేషన్లలో ఏ కేసుల్లో, ఎన్ని స్వాధీనం చేసుకున్న వాహనాలు ఉన్నా యనే లెక్కాపత్రం లేకపోవడం బాధ్యతా రాహి త్యానికి నిదర్శనంగా నిలుస్తోంది.

కొత్త కలెక్టర్‌గా కీర్తి

కలెక్టర్ ప్రశాంతి బదిలీ

- గతంలో జేసీగా చేకూరి కీర్తి
- నాడు పాలనలో తనదైన ముద్ర



కలెక్టర్ చేకూరి కీర్తి



ప్రశాంతి

రాజమహేంద్రవరం/కాకినాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా చేకూరి కీర్తి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం ఏపీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన కీర్తిని ప్రభుత్వం జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేసీగా చేకూరి కీర్తి సేవలందించారు. పాలనలో తనదైన ముద్ర వేసుకున్నారు.ముఖ్యంగా కొవిడ్ సమయంలో ఆమె చేసిన సేవలు ఎనలేనివి. కరోనా బాధితులకు ఆసుపత్రుల ఏర్పాటు, వాటి పనితీరు పరిశీలన ఇలా అనేక విధాలుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అదే సమయంలో ఓ ప్రైవేటు ఆసుపత్రికి రూ.కోటికి పైగా ఫైన్ వేసి ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు ఓ హెచ్చరిక పంపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. విశాఖకు చెందిన చేకూరి కీర్తి తండ్రి వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో స్థిరప డ్డారు. మొదట్నుంచి సమాజానికి ఉపయోగపడే కీలక బాధ్యతల్లో ఉండాలనేది ఆమె కోరిక. ఆమె తాతయ్య డీసీహెచ్ తిరుపతి రాజు నౌకాశ్రయం ఆపరేషన్ మేనేజర్‌గా ఉండే వారు. ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఇంటర్ తర్వాత మద్రాస్ ఐఐటీలో చేరిన కీర్తి.. మెటలర్జీ అండ్ మెటీరియల్ సైన్స్ ఎంచుకున్నారు. ఓ రోజు అక్కడికి వచ్చిన తమిళ ఐఏఎస్ అధికారిని చూసి సివిల్స్ రాయాలని నిర్ణయించుకున్నారు. తొలిసారి సివిల్స్‌లో 440వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపికయ్యారు. రెండోసారి 512 ర్యాంకు తెచ్చుకున్నారు. మూడోసారి ఆలిండియా లెవెల్‌లో 14వ ర్యాంకు సాధించారు. ప్రస్తుత కలెక్టర్ పి.ప్రశాంతికి ఇంకా పోస్టింగ్ ఇవ్వ లేదు. ప్రశాంతి జిల్లా కలెక్టర్‌గా 2024 జూన్ 28వ తేదీన బాధ్యతలు చేపట్టి 14 నెలల 11 రోజులు సేవలందించారు.

ప్రశాంతి బదిలీ ఎందుకంటే?

కలెక్టర్ పి.ప్రశాంతి బదిలీ వెనుక కారణాలేంటనే చర్చ జరుగుతోంది. ఆమె నిబంధనలు తు.చ. తప్పలేదని.. పాలనలో తనదైన ముద్ర వేశారని అధికారులు చెబుతున్నారు. ఎక్కడా అవినీతి మచ్చలేకుండా వ్యవహరించడం గమనార్హం.కొందరు ప్రజాప్రతి నిధులు చెప్పినట్టు వినకపోవడం వల్లే ఆమె బదిలీ అయ్యారనే ప్రచారం ఉంది.కేవలం కలెక్టర్‌గా చాంబర్‌లో కూర్చుని విధులు నిర్వహించడమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించేవారు.ఇసుక బోట్స్‌మన్ సొసైటీల వ్యవహారంలో కొందరు రాజకీయనేతలతో ఆమె విభేదించడమే కాకుండా ఒక పద్ధతి ప్రకారం ర్యాంపులు కేటాయించారు. ఓపెన్ ర్యాంపుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వుతుంటే పట్టుకుని వాటిని మళ్లీ తెరవనీయకుండా చేయగలిగారు. జిల్లాలో పంచాయతీల పరిధిలో పారిశుధ్య మెరుదలకు ప్రయత్నం చేశారు. అధికారులు, ఉద్యోగులు ఎవరు నిర్లక్ష్యంగా ఉన్నా వారిపట్ల కఠినంగా వ్యవహరించేవారు. దివాన్‌చెరువులో పారిశుధ్యం విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారనే కారణంతో ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇంటికి పంపించేశారు.అధికారులంటే ఆఫీసులో కూర్చోవడమే కాదని.ప్రజల్లోకి పంపించారు. నిబంధనల మేరకు.ముక్కుసూటిగా వ్యవహరించడం వల్ల కొంత మందికి శత్రువుగా మారినట్టు ప్రచారం ఉంది.సీఎం చంద్రబాబు పెట్టిన బంగారం కుటుంబం- మార్గదర్శి కార్యక్రమంలో ఆమె మొదట ఓ కుటుంబాన్ని దత్తత తీసుకున్నారు. ఎరువుల కొరత ప్రచారాన్ని తిప్పికొట్టారు. రాజమహేంద్రవరం కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించి కార్పొరేషన్ పనితీరును ఒక పద్ధతిలో పెట్టారు. మునిసిపాలిటీలో ఫీల్డ్ వర్కు అంటూ ఇంటికెళ్లిపోయే అనేకమంది అధికా రులకు ఆమె అదనపు బాధ్యతలు అప్పగించారు. కార్పొరేషన్‌ను గాడిలో పెట్టారు. ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని నగరంలో చాలా వరకు అమల్లోకి తెచ్చారు.బర్త్, డెత్ సర్టిఫి కెట్ల ఫారమ్ మోడల్ కొత్తది అమల్లోకి తెచ్చా రు. ఆమె కఠిన వైఖరి.ఎవరిని లెక్క చేయకపోవడమే ఆమె బదిలీకి కారణంగా తెలుస్తోంది.



పెట్రో కెమి..కిల్ ఫ్యాక్టరీ!

గత వైసీపీ నిర్లక్ష్యం..గాల్లో కలిసిన ప్రాజెక్టు

ఒక్క ఛాన్స్ అంటే.. ఓటరు ఆలోచించాడు.. అవకాశమిచ్చాడు.. ఆ అవకాశాన్ని జగన్ దుర్వినియోగం చేశారు.. ఎంతలా అంటే అభివృద్ధి చేయాల్సిన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వదిలేశారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో ఘటనే ఇందుకు నిదర్శనం.. గత వైసీపీ విధానాలతో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిపోయిందని నాయకులు అంటూనే ఉంటారు.. ఇది అక్షర సత్యం.. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 32 వేల కోట్ల ప్రాజెక్టు ఇస్తామంటే వదులుకుంటారా.. అధికారమిచ్చిన ఐదేళ్లూ పట్టించుకోకుండా జగన్ వదిలేశారు.. ఆ ప్రాజెక్టును అతీగతీ లేకుండా చేసేశారు...ఆ కథాకమామిషు ఏమిటో తెలుసుకోవాలనుందా..!

- కాకినాడ, ఆంధ్రజ్యోతి


కాకినాడలో రూ.32 వేల కోట్లతో తొమ్మిదేళ్ల కిందట తలపెట్టిన పెట్రో కెమికల్ కాంపెక్స్ ఏర్పాటు ముగిసిన అధ్యాయంగానే కనిపిస్తోంది. ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్న నేపథ్యంలో కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ఎప్పటికైనా ఇక్కడా ఆ తరహా ప్రాజెక్టు రాకపోతుందా అనే ఆశలు తాజాగా నెల్లూరు ప్రాజెక్టుతో అడియాశలైనట్లయింది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో పూర్తిగా ఈ ప్రాజెక్టు మూలనపడి పోయింది. పెట్రో కాంప్లెక్స్ వీజీ ఎఫ్ నిధులు రాష్ట్రం భరించే విషయంలో అప్పటి జగన్ సర్కారుదే తప్పని కేంద్రం కుండబద్దలు కొట్టింది. ఇక్కడ ప్రాజెక్టు ఏర్పాటుకు రెండు వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నప్పటికీ గత సర్కారు తీరు వల్ల ప్రాజెక్టు కొడిగట్టిపోయింది.

కొంపముంచిన బాధ్యతా రాహిత్యం..

రాష్ట్ర విభజన సమయంలో విభజిత ఆంధ్రప్రదేశ్‌కు అప్పటి కేంద్ర ప్రభుత్వం ఒక్కో జిల్లాకు ఒక్కో కొత్త ప్రాజెక్టు కేటాయించింది. అందులో భాగంగా కాకినాడలో రూ.32 వేల కోట్లతో భారీ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొంది. 2017లో కాకినాడ ఎస్‌ఈజెడ్‌లో రెండు వేల ఎకరాల్లో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి గెయిల్- హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఒప్పందం కుదుర్చుకున్నాయి. 1.5 ఎంఎంటీపీఏ సామర్థ్యంతో పెట్రో కాంప్లెక్స్‌ను ఏర్పాటుకు వీలుగా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో అంగీకార పత్రాలు మార్చుకున్నాయి. విదేశాల నుంచి ముడిచమురు కాకినాడకు దిగుమతి చేసుకుని ఇక్కడే కర్మాగారం ఏర్పాటుచేసి, దాన్ని శుద్ధి చేసి దేశీయంగా వినియోగించడం ప్రాజెక్టు ముఖ్యోద్దేశం.

- విభజన హామీగా పెట్రో కెమికల్ కాంప్లెక్స్
- రూ.32 వేల కోట్లతో ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్
- తొమ్మిదేళ్లు పూర్తయినా కదలిక లేదు
- తాజాగా నెల్లూరులో బీపీసీఎల్ ప్రాజెక్టు
- కాకినాడ పెట్రో కెమికల్ ప్రాజెక్టుపై చర్చ
- ప్రాజెక్టు జాప్యానికి బాధ్యత వైసీపీదేనన్న కేంద్రం
- నాడు బాబు పట్టుదల.. జగన్ నిర్లక్ష్యంతో మూలకు

నాడు చంద్రబాబు ఏం చేశారు?



ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలెక్కించడానికి 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం చొరవ చూపింది. పనులు ప్రారంభిం చేలా కేంద్రంపై అప్పటి సీఎం చంద్రబాబు ఒత్తిడి తెచ్చారు. రూ.32 వేల కోట్ల విలువైన పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటు వల్ల కేంద్రం ఇచ్చే ఆర్థిక మద్దతు, రాష్ట్ర ప్రభుత్వం భారీగా లబ్ధిపొందనున్నందున రూ.5,615 కోట్లు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) రూపంలో తమకు చెల్లించాలని అప్పట్లో కేంద్రం మెలిక పెట్టింది. అలా అయితేనే ప్రాజెక్టు ముందుకు కదులుతుందని పేర్కొంది.కానీ రాష్ట్రం విడిపోయి నష్టపోయినందున ఆ మొత్తం తాము భరించలేమని చంద్రబాబు కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. కేంద్రం కొంత మెత్తబడినట్టే కనిపించింది.

తరువాత జగనేం చేశారు?



2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. నాటి నుంచీ ఈ ప్రాజె క్టు ఊసు పక్కన పడిపోయింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో 2021 జూన్‌లో కేంద్రాన్ని సీఎం హోదాలో జగన్ కలిసి ప్రాజెక్టు కొనసాగించాలని కోరా రు. కానీ కేంద్రం నుంచి సానుకూల ప్రకటనేదీ రాలేదు. మూడేళ్ల కిందట పెట్రో కాంప్లెక్స్ అసలు కాకినాడకు వస్తుందా? రాదా? అనే దానిపై పలువురు ఎంపీలు కేంద్రాన్ని లోక్‌సభలో ప్రశ్నిస్తే ప్రాజెక్టు జాప్యానికి జగన్ ప్రభుత్వమే కారణం అని కుండ బద్దలుకొట్టింది. తాము అన్ని అనుమతులు మంజూరు చేసినా నష్ట భర్తీ నిధి చెల్లింపుపై ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ఏర్పాటుపై నిర్ణయం ఏపీ ప్రభుత్వానిదేనని సమాధానమిచ్చింది. అయినా జగన్ ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదు. దీంతో ప్రాజెక్టుపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభు త్వం మళ్లీ ఆ ఫ్యాక్టరీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నెల్లూరు ప్రాజెక్టుతో మళ్లీ చర్చ..

రాష్ట్రప్రభుత్వం చొరవతో ఇటీవల నెల్లూరులో రూ.లక్ష కోట్లతో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఏటా తొమ్మిది మిలియన్ మెట్రిక్ టన్నుల సా మర్థ్యంతో దీన్ని స్థాపిస్తోంది. ప్రాజెక్టు ద్వారా వేల మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. 42 నెలల్లో పూర్తి చేసేలా ఇటీవల ప్రణాళికలు సిద్ధమయ్యాయి. రెండు రోజుల కిందట బీపీసీఎల్ పెట్రో కాంప్లెక్స్‌కు కేంద్ర అటవీ పర్యావరణశాఖ నుంచి కీలక అనుమతులు జారీ అయ్యాయి. దీంతో ఇప్పుడు కాకినాడ పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. తొమ్మిదేళ్ల నుంచి అతీగతీ లేని ప్రాజెక్టు నెల్లూరు పెట్రో కాంప్లెక్స్ ఏర్పాటుతో ఇక్కడా ఎంతో కొంత కదలిక రావాలనే ఆకాంక్షలు వ్యక్తమవుతున్నాయి. పెట్రో ప్రాజెక్టుకు అనువైన వాతావరణం ఉన్నా కేంద్రం పట్టించుకోక కాకినాడ పెట్రోకాంప్లెక్స్ అధ్యాయం ముగిసినట్టే కనిపిస్తోంది.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి 'స్ఫూర్తి ప్రదాత'

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి కలెక్టర్ ప్రశాంతి వినూత్న కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.రామకృష్ణ మిషన్ సహకారంతో ఈ నెల 20 నుంచి ప్రతి శనివారం వీడియో కాన్ఫరెన్స్ విధానంలో స్ఫూర్తిదాయక ప్రసంగాలను చెప్పిస్తారు. వివేకానంద చికాగో ప్రసంగం రోజును పురస్కరించుకొని 213 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులతో ఆమె ముఖాముఖి నిర్వహించారు. క్రమశిక్షణ, స్థిత ప్రజ్ఞత,విశాల దృక్పథం, సామాజిక స్పృహను పెంపొందించడానికి 'స్ఫూర్తి ప్రదాత' ఉపకరిస్తుందన్నారు. 'బలమే జీవనం, బలహీనతే మరణం' అని వివేకానంద చెప్పిన సందేశాన్ని గ్రహించి విద్యార్థులు బలహీనతను వదిలి ధైర్యంతో, లక్ష్యసాధనతో ముందుకు సాగాలన్నారు. రామకృష్ణ మిషన్ నుంచి స్వామి పరిజ్ఞేయానంద, స్వామి సేవ్యానంద ఉపదేశించారు.ఈ కార్యక్రమంలో డీఎస్ఈవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సలహాలకు డయల్ 15100

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. ఆనంద్ నగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పిల్లలకు స్నేహపూర్వక చట్టపరమైన సేవలు, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల నిషేధం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు న్యాయపరమైన సలహాలకు 15100 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. హెచ్ఎం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ పిల్లలకు మెగా వైద్యశిబిరం

బిక్కవోలు, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): బలభద్రపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం దివ్యాంగ పిల్లలకు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. దీనికి పిల్లలను తీసుకువచ్చేటప్పుడు పిల్లల ఆధార్, రేషన్‌కార్డు, సదరం ధ్రువపత్రం, ఫొటోలు, యూడీఐడీ కార్డు ఒరిజినల్స్‌తో పాటు జెరాక్స్ కాపీలు కూడా తీసుకురావాలని ఆయన సూచించారు.

వృద్ధులకు డైపర్ల పంపిణీ



ఆశ్రయ ఫౌండేషన్‌లో పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆశ్రయ ఫౌండేషన్‌లో గురువారం వృద్ధులకు లయన్స్ క్లబ్ సభ్యులు డైపర్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన కంటమణి రామకిషోర్ కుమార్తె హరిత జన్మదినాన్ని పురస్కరించుకుని రోగులకు డైపర్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీ.జయరాజు, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, గోలివెంకటరత్నం, ఎండీ హుస్సేన్, మద్దిపాటి సత్యనారాయణ, యనమదల సుబ్రహ్మణ్యం, మన్యం బుల్లిబాబు, ఉప్పులూరి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ సందర్శన



వడ్డిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్లు ఏర్పాటుచేసి 100 శాతం లక్ష్యాలను చేరుకున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అన్న క్యాంటీన్‌ను బీజేపీ నాయకులు సందర్శించారు. భోజనానికి వచ్చిన ప్రజల నుంచి ఆహార పదార్థాల నాణ్యత గురించి తెలుసుకుని, స్వయంగా రుచి చూశారు. అనంతరం భోజనాలు వడ్డించారు. నాగేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో బోడపాటి ముత్యాలరావు, కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, తాడిమళ్ల విజయవాణి, తురగా విజయ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఆవపాడులో గ్రావెల్ రోడ్డు నిర్మించారు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



జగనన్న కాలనీలో గ్రావెల్ రోడ్డు వేస్తున్న దృశ్యం

నల్లజర్ల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆవపాడులో పాడైన గ్రావెల్ రోడ్డును గురువారం సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ వేయించారు. జగనన్న కాలనీలో గత ప్రభుత్వం రోడ్లు వేయకుండా వదిలేయడంతో ఇల్లు నిర్మించుకునేందుకు లబ్ధిదారులు నానా ఇబ్బందులు పడ్డారు. సిమెంట్, ఇటుక, ఇసుక తీసుకోని వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో దీనిపై పలుమార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వెలువడ్డాయి. దీనికి స్పందించిన సర్పంచ్ అచ్యుత సత్యనారాయణ గ్రావెల్ రోడ్డు వేయించారు. దీంతో ప్రతి లబ్ధి దారుడు ఇంటికి రాకపోకలు చేసుకుని అవకాశం కలిగింది. ఈ మేరకు సర్పంచ్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నేపాల్ మారణహోమంపై జగన్ స్పందించాలి : ఎమ్మెల్యే



కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేపాల్ మారణహోమంలో 215 మంది తెలుగు వారు చిక్కుకుంటే జగన్ రెడ్డి నుంచి కనీసం స్పందించలేదని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నేపాల్ మారణహోమంలో తెలుగువారు ఉన్నారని తెలియగానే మంత్రి నారా లోకేష్ ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా స్పందించారన్నారు. అనంతపురం పర్యటనను రద్దు చేసుకుని సచివాలయంలోని రియల్‌టైం గవర్నెన్స్ సెంటర్ వార్ రూమ్‌ను కమాండ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి తక్షణ సహాయక చర్యలను ప్రారంభించారన్నారు. అక్కడి బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వం అండతో ఆపదలో ఉన్నవారిని సురక్షితంగా రక్షించడానికి చర్యలు చేపట్టారన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

పెరవలి: రాష్ట్రంలో ఏడు మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని పీపీపీ మోడల్‌లో నిర్మాణం చేసే నిమిత్తం కేబినెట్ తీర్మానం చేసి బాధ్యతల నుంచి తప్పుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శి గుమ్మాపు చిత్రసేను, ఏలూరి అశోక్ కుమార్ అన్నారు. గురువారం పెరవలి తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. సిర్రా రాజు, చల్లాబత్తుల సత్యనారాయణ, నల్లి రమేష్‌బాబు, శ్రీలక్ష్మి, బద్దా జాన్, గొల్ల ధనరాజు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవడం ద్వారా కొవ్వూరు పట్టణాన్ని అక్షరాస్యత పట్టణంగా తీర్చిదిద్దవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరు ఎన్‌జీవో హోమ్ -1లోని 8వ సచివాలయంలో గురువారం మెప్మా ఆధ్వర్యంలో అక్షర ఆంధ్రా లిటరసీ (ఉల్లాస్) కార్యక్రమం నిర్వహించారు. యుఎల్‌బీ లెవల్ వలంటీర్లకు రెండురోజుల శిక్షణ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రారంభించి, వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. మెప్మా టీఎంసీ జేవీవీఎన్ భవాని మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా 15 నుంచి 59 సంవత్సరాల వయసు కలిగిన నిరక్షరాస్యులకు ప్రాథమిక గణితం, డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, చదవడం, రాయడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి 10 మందికి ఒక ట్రైనర్‌ను ఏర్పాటుచేసి అక్షరాస్యతపై శిక్షణ అందజేయడం జరుగుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, తదితరులు

కార్యక్రమంలో మెప్మా డీఈవో కనకదుర్గ, సీఎల్‌ఎఫ్ ఓబీ ఎం.రత్న, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్‌పీలు, ట్రైనర్ రిటైర్డ్ హెడ్‌మాస్టారు వీటీ విల్సన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్రాపై అవగాహన

తాళ్లపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వయోజన నిరక్షరాస్యులను అక్షర ఆంధ్రా కార్యక్రమంలో అక్షరాస్యులుగా మార్చాలన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషిచేయాలని ఎం పీడీవో ఎస్. వేణుగోపాల రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అక్షర ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీవో రమాదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి వచ్చే వారిలో నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పేందుకు ప్రత్యేక ట్రైనీలు ఉన్నారని తెలిపారు. అలాగే మహిళా గ్రూపుల్లో చదువు రాని సర్వే చేసి వారికి కూడా చదువు నేర్పాలన్నారు. ఎంఈవో - 2 నెహ్రూజీ, వెలుగు ఏపీఎం మంగాయమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు జీవన భద్రత కల్పించాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీమన్నారాయణ



నిరసన తెలుపుతున్న కార్మికులు

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకంతో ఉపాధి కోల్పోయిన ఆటో కార్మికులకు జీవన భద్రత కల్పించాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను వదిలి వేసిన చంద్రబాబు వైఖరిని వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ పెనాల్టీల జీవో 21 రద్దు, సాధికారిత బోర్డు ఏర్పాటు, ఇంధన ధరల తగ్గింపు వంటి ఎన్నికల హామీలను తక్షణం అమలు చేయాలన్నారు. అలాగే వాహనమిత్ర ద్వారా రూ. 30 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో పీ.నాగేశ్వరరావు, ఈ. గ్రీష్మకుమార్, ఆటో యూనియన్ నాయకులు టీ.వెంకటేశ్వరరావు, ఆర్.నేతాజీ, వీ.సత్యనారాయణ, ఆర్.హరీష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికాబద్ధంగా జరగాలని ఎంపీడీవో పీఎస్ రామారావు పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి అభివృద్ధి పనికి పంచాయతీరాజ్ ఇండెక్స్ పోర్టల్‌లో నమోద చేయాలని సూచించారు. అనంతరం వివిధ అంశాలపై రిసోర్స్‌పర్సన్లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ, హౌసింగ్ ఏఈ ఏడుకొండలు, పీఆర్‌ఏఈ ఎన్. ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

సార్వా వరిలో సస్యరక్షణ చర్యలు అవసరం

ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నరసింహారావు



వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సార్వా వరి పంటలో సస్యరక్షణ చర్యలు అవసరమని ఏరువాక కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ డా.చల్లా వెంకట నరసింహారావు తెలిపారు. గురువారం కొవ్వూరు మున్సిపాల్టీ పరిధిలోని రైతు కమతాలలో వరి పంటలను ఏరువాక శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. వెంకటనరసింహరావు మాట్లాడుతూ సార్వాలో రైతులు సాగుచేస్తున్న ఎంటీయూ 7029, ఎంటీయూ 1318, పిఎల్‌ఏ 1100, విత్తన కోసం వేసిన ఎంటీయూ 1121 వరి మంచి ఫలితాలను ఇస్తుందని, పంట ఎదుగుదల, దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. జిల్లా వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ వరి చీడపీడలు లేకుండా ఆరోగ్యంగా ఉందన్నారు. ప్రస్తుతం వరిలో పిలక, అంకురం దశల్లో కాండం తొలిచే పురుగు, తల్లి పురుగు, గ్రుడ్ల సముదాయాలు కనిపిస్తున్నట్లు గమనించామన్నారు. నివారణకు ఎకరాకు క్యార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోల చొప్పునవేయాలి. లేదా ఎసిఫెట్ 1.5 గ్రా లేదా క్లోరన్ట్రనిలి ప్రోల్ 0.3 మి.లీ లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. క్యారోఫ్యూరాన్ గుళికలను బురద పదునులో వేసి తదుపరి పలుచగా నీరు పెట్టాలి. ఇటీవల వర్షాలకు మాగుడు తెగులు కనిపిస్తుందని, నివారణకు హెక్సాకొనజోల్ 2.0 మి.లీ ఒక లీటరునీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డా. మానుకొండ శ్రీనివాస్, ఏవోలు సీహెచ్ శ్రీనివాసరావు, ఏ.గంగాధర్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు



కొవ్వూరులో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కొవ్వూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్, గవర్నమెంట్ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాల, బ్రిడ్జిపేట,మద్దూరులంక, మద్దూరు, సీతంపేట పాఠశాలల్లో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. జిల్లా అధ్యక్షులు దుర్గారావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాలను విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి, మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. యాప్‌లను రద్దుచేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. అసెస్‌మెంటు బుక్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సలీం, జానీ, భాస్కరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

తాళ్లపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి ఆర్యవైశ్య సంఘ సమావేశం గురువారం ఆర్య వైశ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు అధ్యక్షతన ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా యండపల్లి సూర్య శేష గిరిరావు (శేఖర్)ను, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలిగా కొండూరి మహాలక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. దీనిలో భాగంగా రెండు సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని ఏసీ కల్యాణ మండపంగా తీర్చిదిద్దుకోవడానికి అందరి ఆర్థిక సహకారం అందించాలని సింహాద్రి జనార్దనరావు పిలుపునివ్వగా, గ్రామంలోని ఆర్యవైశ్యులు తమకు తోచిన సహాయాన్ని ప్రకటిస్తూ సుమారు రూ. 25 లక్షల విరాళం అందించారు. గోకవరపు కృష్ణ, కొండూరి శ్రీరామచంద్రమూర్తి, గోకవరపు సూరిబాబు, గోకవరపు బాబులు, గుడివాడ సూరిబాబు, అప్పన రాజా, కంకిపాటి శ్రీను, కంకిపాటి బాబూరావు పాల్గొన్నారు.

'అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత తప్పనిసరి'



గోపాలపురంలో చేపడుతున్న పనులు పరిశీలిస్తున్న ఎస్.ఈ శేషగిరిరావు

గోపాలపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలకు లోబడి నిర్మాణాలు జరపాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఎస్ఈ శేషగిరిరావు అన్నారు. నియోజకవర్గ ముఖ్య కేంద్రమైన గోపాలపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ.61 లక్షలతో నిర్మిస్తున్న నూతన భవన పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో వినియోగిస్తున్న మెటీరియల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా శాశ్వత కట్టడాల్లో భాగంగా అన్నక్యాంటీన్ భవనాలు నిర్మిస్తోందన్నారు. అందులో భాగంగా క్షేత్రస్థాయి నుంచి నాణ్యత ప్రమాణాలకు లోబడి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా భవన నిర్మాణం జరగాలన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీఈ విజయపార్వతి, జేఈ అజయ్, తదితరులు ఉన్నారు.

మంత్రి లోకేశ్ సేవలపై ఎమ్మెల్యే మద్దిపాటి ప్రశంసలు



గోపాలపురం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు వారు దేశంలో ఎక్కడైనా ఇబ్బంది పడుతున్నారంటే తక్షణమే స్పందించే వ్యక్తి మంత్రి నారా లోకేశ్ అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నా రు. గురువారం ఆయన గోపాలపురంలో విలేఖర్లతో మాట్లా డుతూ నేపాల్‌లో తెలుగు వారు విపత్కర పరిస్థితుల్లో ఉన్నారని తెలుసుకున్న లోకేశ్ అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ భారీ బహి రంగ సభను సైతం రద్దు చేసుకుని అమరావతి సచివాలయానికి చేరుకుని రియల్‌టైమ్ గవర్నెనెన్స్ సెంటర్ వార్ రూమ్‌ను కమాం డ్ కంట్రోల్ రూమ్‌గా మార్చి సహాయ చర్యలను వేగవంతం చేశారని అన్నారు. నేపాల్‌లో ఉన్న బాధితులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారన్నారు. అలాగే ఢిల్లీలోని ఏపీ భవన్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి ఆహారం, నీరు, వసతి సదుపాయం, మౌలిక వసతులు కల్పించే చర్యలు చేపట్టారన్నారు. అనంతరం పలు విషయాలపై ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడారు.

అదనపు పని భారం తగ్గించాలి



తాళ్లపూడిలో ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

తాళ్లపూడి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ ఉద్యోగులు తమకు కేటాయించిన అదనపు పనిభారాన్ని తొలగించాలని కోరుతూ గురువారం ఎంపీడీవో వేణుగోపాల రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. మండలంలోని సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ గతంలో వాలంటీర్లు చేసే పనిని సైతం తమ కే అప్పగించడం వల్ల మిగతా పని భారాన్ని తగ్గించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు మండలంలోని సచివాలయ ఉద్యోగులందరూ కార్యక్రమాన్ని చేపట్టి ఎంపీడీవోకు వినతిపత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలి

● ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లారీశ్వరి

ఉండ్రాజవరం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సభ్యులు అడిగిన సమస్యల పరిష్కారానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు లేవనెత్తిన సమస్యలు త్వరగా పరిష్కరించి, గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి బీ. రాజారావు మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 65 శాతం మంది రైతుల మాత్రమే నమోదు చేయించుకున్నట్టు ఆయన వివరించారు. తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో సిబ్బంది కొరత ఉండగా, ప్రభుత్వం వివిధ సర్వేలకు సిబ్బందిని పంపించడంతో గ్రామాభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఇంటిపన్నులో ఈ ఏడాది నుంచి వాట్సాప్ స్కానర్ ద్వారా చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. నిరక్షరాస్యులు, స్మార్ట్ ఫోన్ లేనివారు స్కానర్ ద్వారా ఎలా చెల్లిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో పీఎస్ రామారావు వివిధ పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.